www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

**JOURNALISTS WANTED**

- Aashwi Updates – Voice of the People
- Telangana & Andhra Pradesh
- District Bureau: Degree mandatory
- Mandal Reporters: Intermediate mandatory
- News writing & reporting skills required
- Interest in public issues preferred
- Honorarium: Based on experience & performance
- Join Aashwi Updates. Be the Voice of the People!

editor@aashwi.in
7207282727 | 72707292727



6

ఆత్మహత్యలు వద్దు.. మీ కోసం మీ కుటుంబం ఎదురుచూస్తోంది

శుక్రవారం, 11-09-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :127 Issue : 127 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in



## టెస్సెరాక్ట్ భూములపై క్షేత్రస్థాయి పరిశీలన

- సస్పెన్షన్‌కు బీఆర్ఎస్ కౌంటర్
- తుక్కుగూడ, రావిర్యాలలో కేటీఆర్, హరీశ్‌రావు పర్యటన
- ఫ్యూచర్ సిటీపై గులాబీ దండయాత్ర
- రేవంత్ కుటుంబానికి లబ్ధి చేకూర్చేలా భూకేటాయింపులంటూ ఆరోపణలు
- జీవోలు, టెండర్లు, భూకేటాయింపులపై ప్రశ్నలు
- ప్రభుత్వంపై న్యాయ, రాజకీయ పోరాటం ఉధృతం చేస్తామని సంకేతాలు

2

## రూ.250 కోట్ల విలువైన భూమి రూ.7కోట్లకే ..

- సీఎం తన తమ్ముడికి ఇంత తక్కువ ధరకు ఎట్లా కేటాయిస్తారు?
- భూ కేటాయింపు వివరాలు ప్రజలముందుంచాలి
- ఈ భూ దందాపై బీజేపీ ఎందుకు ప్రశ్నించదు?
- ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ

2



## నీరున్నా పంటలను కాపాడలేని ప్రభుత్వం

- ఇది రేవంత్ తెచ్చిన కరువు
- రాష్ట్ర రైతుకు నీరు నిల్.. ఏపీకి ఫుల్
- ఇదీ ప్రభుత్వ నిర్వాకం
- నిప్పులు చెరిగిన హరీష్‌రావు

2

# అసెంబ్లీలో ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి

- వెయ్యి రోజుల్లో చేపట్టిన కార్యక్రమాలు వివరించడమే సభ లక్ష్యం
- మూడు రోజులు సభ జరగకుండా అడ్డుకున్నారు
- ప్రజాప్రతినిధులను దూషించారు
- అధికారులపై అనుచితంగా ప్రవర్తించారు
- దళితులు నడిచిన నేలను శుద్ధిచేసి అవమానించారు
- జరిగిన సంఘటనలపై విచారణ
- సీఎల్‌పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్ :** ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఫామ్ హౌస్ లో కెసీఆర్ అధ్యక్షతన సభను సజావుగా జరగకుండా కుట్ర చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. గురువారం నిర్వహించిన సీఎల్‌పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించడమే సభ నిర్వహణ లక్ష్యమన్నారు. అధికారం పోయినా అహంకారం వీడకుండా పోలీసు అధికారులను, ప్రజా ప్రతినిధులను దూషించి మూడు రోజులు సభను సజావుగా జరగకుండా చేశారన్నారు. అధికారులపై అనుచితంగా వ్యవహరించడం, మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించడం చేశారు. శాసన సభాపతిని అత్యంత అభ్యంతరకరంగా దూషించారు. నిరసన తెలిపేందుకు

మిగతా 2వ పేజీలో..







## భూమి ఆరోగ్యమే రైతు భవిష్యత్‌కు బలం

- అధిక రసాయన ఎరువుల వినియోగానికి ప్రత్యామ్నాయంగా ఆధునిక సాంకేతికత
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడే లక్ష్యంగా నూతన న్యూట్రియెంట్ ఉత్పత్తులు
- సినర్జీ సంస్థ ఉత్పత్తుల ఆవిష్కరణలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

**ఆశ్వి అప్డేట్స్ | హైదరాబాద్ | సెప్టెంబర్ 10:** దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక అయితే.. ఆ వ్యవసాయానికి భూమాతే ప్రాణాధారం. నేల ఆరోగ్యంగా ఉంటేనే పంట ఆరోగ్యంగా ఉంటుంది.. పంట ఆరోగ్యంగా ఉంటేనే రైతు కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంటుంది. ఈ నేపథ్యంలో భూమిలోని పోషక లోపాలను గుర్తించి, అవసరమైన పోషకాలను సమతుల్యంగా అందిస్తూ భూసారాన్ని పరిరక్షించే సాంకేతికతకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఈ దిశగా సినర్జీ సంస్థ రూపొందించిన

మిగతా 6వ పేజీలో..

## కరెంటు కోతలతో మళ్లీ పాత రోజులు: కేటీఆర్

- కాంగ్రెస్ పాలనలో విద్యుత్ సరఫరా తీరుపై విమర్శలు
- సీఎం సొంత ఊరిలోనూ రైతులకు కరెంటు కష్టాలంటూ ఆరోపణ
- కొండారెడ్డిపల్లిలో పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆవేదన
- మోటార్లు నడవక సాగుకు ఇబ్బందులు
- కేసీఆర్ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందించామన్న కేటీఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, ఆశ్వి అప్డేట్స్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి పూర్తిగా మారిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. మళ్లీ పాత రోజుల్లోని కరెంటు కష్టాలు వచ్చాయని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఊరు కొండారెడ్డి పల్లికి చెందిన రైతులతో కూడిన వీడియోను ఎక్స్‌లో పంచుకుంటూ ప్రభుత్వంపై

మిగతా 3వ పేజీలో..

## రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో మళ్లీ వేడి

- రేవంత్‌తో భిన్నాభిప్రాయాలే.. విభేదాలు కావన్న ఎమ్మెల్యే
- మంచిని మంచి.. చెడును చెడుగా చెప్పడం తన నైజమని వెల్లడి
- మంత్రి పదవి సీఎం చేతిలో లేదని స్పష్టం
- పదవి కోసం ఎప్పుడూ రాజీ పడలేదని వ్యాఖ్య
- కలిస్తే కాంప్రమైజ్.. కలవకపోతే గ్యాప్ అంటూ ప్రచారంపై ఆగ్రహం

4

## రూ.కోటి బీమా.. దేశంలోనే తొలిగా

- ప్రభుత్వం, ఉద్యోగులపై రూపాయి భారం పడకుండా అమలు
- 12.91 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తింపు
- ఇప్పటికే 98 క్లెయిమ్‌ల పరిష్కారం
- ఉద్యోగుల కోసం హెల్త్‌కార్డు కూడా తీసుకొచ్చాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

4



## నిధుల వినియోగానికి స్వేచ్ఛ అవసరం

- అందుకే పంచాయతీరాజ్ చట్టం-2018కు సవరణ
- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మంత్రి సీతక్క

3

## ఇందిరమ్మ ఇళ్లు .. పేదల ఆత్మగౌరవానికి తగినట్టు

3



- ఏ నియోజకవర్గంలోని పేదలకు ఆ నియోజకవర్గంలోనే
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి స్పష్టీకరణ



## గణేష్ నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

- సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు నమ్మొద్దు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:** హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

మిగతా 3వ పేజీలో..

## రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు

- ఫేక్ ఎక్స్ ఖాతాతో సభను తప్పదోవ పట్టించారు?
- కేసీఆర్ ప్రతిష్టకు భంగం కలిగించారని ఆరోపణ
- స్పీకర్‌కు కూడా బీఆర్ఎస్ ఫిర్యాదు

2

## కేటీఆర్, హరీష్‌లపై లైంగిక వేధింపుల కేసు

- మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో నమోదు!
- అసెంబ్లీ గేట్ వద్ద టీషర్టులు విప్పి అర్ధనగ్నంగా నిరసన చేశారంటూ ఫిర్యాదు
- విధులకు ఆటంకం, బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపణ

2

## స్పీకర్‌పై వ్యాఖ్యల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు షాక్?

- తాతా మధు, నవీన్‌రెడ్డి బెయిల్ రద్దుకు పోలీసుల పిటిషన్
- నిబంధనలు ఉల్లంఘించారని నాంపల్లి కోర్టుకు నివేదిక
- అట్రాసిటీ చట్టం వర్తిస్తుందని పోలీసుల వాదన

4

# టెస్సెరాక్ట్ భూములపై క్షేత్రస్థాయి పరిశీలన

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, ఆశ్వి అప్డేట్స్:** శాసనసభ నుంచి సస్పెన్షన్‌కు గురైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై పోరాటాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో భారీ భూకేటాయింపులు జరిగాయని, వాటి ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రయోజనం చేకూరేలా వ్యవహరించారని బీఆర్ఎస్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలోని బృందం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ, రావిర్యాల ప్రాంతాల్లో పర్యటించింది.

**టెస్సెరాక్ట్ భూముల పరిశీలన**

తుక్కుగూడలోని టెస్సెరాక్ట్ ఆవరణకు చేరుకున్న కేటీఆర్, హరీశ్‌రావు నేతృత్వంలోని సస్పెండెడ్ ఎమ్మెల్యేల బృందం అక్కడి భూములను పరిశీలించింది. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డికి ప్రయోజనం చేకూర్చేలా వేలాది కోట్ల విలువైన భూములను ప్రభుత్వం కేటాయించిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అసెంబ్లీలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా సస్పెండ్ చేసినా, ప్రజల తరఫున క్షేత్రస్థాయిలో భూకేటాయింపుల వ్యవహారాలను బయటపెడతామని తెలిపారు.

**భూకేటాయింపులపై ప్రశ్నలు**

ఫ్యూచర్ సిటీ, తుక్కుగూడ, రావిర్యాల పరిధిలో ప్రభుత్వం జారీ చేసిన జీవోలు, టెండర్లు, భూకేటాయింపుల ప్రక్రియపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నలు సంధించారు. ప్రజా ప్రయోజనాల పేరుతో రైతుల భూములను స్వాధీనం చేసుకుని సీఎం కుటుంబానికి చెందిన సంస్థలు, కంపెనీలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ వ్యవహారాలు ఏ స్థాయికి చేరాయో తుక్కుగూడ, రావిర్యాల భూకేటాయింపులు వెల్లడిస్తున్నాయని విమర్శించారు.

**పోలీసులతో వాగ్వాదం**

బీఆర్ఎస్ నేతల పర్యటనతో రావిర్యాల, ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. సస్పెండెడ్ ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలను అడ్డుకునేందుకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పార్టీ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి.అసెంబ్లీలో సస్పెన్షన్‌కు గురైన తమ పోరాటాన్ని ప్రజాక్షేత్రంలో కొనసాగిస్తామని కేటీఆర్, హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, రేవంత్‌రెడ్డి కుటుంబంపై వస్తున్న భూకేటాయింపుల ఆరోపణలపై న్యాయపరంగా, రాజకీయంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. దీంతో ఫ్యూచర్ సిటీ భూకేటాయింపుల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరింత వేడి పెంచే అంశంగా మారింది..

# కేటీఆర్, హరీష్‌లపై లైంగిక వేధింపుల కేసు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, ఆశ్వి అప్డేట్స్:** తెలంగాణ శాసనసభ సమావేశాల తొలిరోజు అసెంబ్లీ గేట్ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల నిరసన తీవ్ర వివాదానికి దారితీసింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ నేతలను గేట్ నంబర్ 3 వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, బీఆర్ఎస్ నేతలకు మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మహిళా పోలీసులపై దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.

**మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో కేసు**

సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తానీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే డి.సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు నేతలపై కేసులు నమోదయ్యాయి. నినాదాలతో కూడిన టీషర్టులు ధరించిన వారిని నిబంధనల ప్రకారం లోపలికి అనుమతించబోమని చెప్పినందుకు తమను తీవ్ర పదజాలంతో దూషించారని కానిస్టేబుల్ ఆరోపించారు. నిరసన సందర్భంగా కొందరు నేతలు టీషర్టులు విప్పి అర్ధనగ్నంగా తమ వైపునకు వచ్చారని, దీంతో తీవ్ర అసౌకర్యానికి, మానసిక వేదనకు గురయ్యామని ఫిర్యాదులో పేర్కొన్నారు. తోపులాటలో మహిళా సిబ్బందిపై శారీరక ఒత్తిడి తెచ్చి విధులకు ఆటంకం కలిగించారని, అధికారంలోకి వచ్చిన తర్వాత చూసుకుంటామని బెదిరించారని ఆరోపించారు. ఘటనలో తాను మానసికంగా, శారీరకంగా గాయపడి చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మీడియా వీడియోలు, సీసీటీవీ ఫుటేజీలు, వైద్య రికార్డులను పోలీసులకు అందించినట్లు వెల్లడించారు.

**కక్షసాధింపు చర్యలంటున్న బీఆర్ఎస్**

మరోవైపు కేసు నమోదుపై బీఆర్ఎస్ తీవ్రంగా స్పందించింది. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ప్రతిపక్ష నేతలను అడ్డుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసులు పెట్టిందని ఆరోపించింది. తమ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు దురుసుగా వ్యవహరించిన అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసులు నమోదు చేశారని కేటీఆర్, హరీశ్‌రావు వర్గాలు విమర్శించాయి.

మరోవైపు బీఆర్ఎస్ నేతల తీరును నిరసిస్తూ కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యేలు మహిళా కమిషన్‌ను ఆశ్రయించడంతో వివాదం మరింత ముదిరింది.

**సెక్షన్లతో మరింత ఉత్కంఠ**


భారతీయ న్యాయ సంహితలోని 74, 75(1), 79, 121(1), 132 తదితర సెక్షన్ల కింద కేసు నమోదు కావడంతో రాజకీయ వేడి పెరిగింది. ప్రజాప్రతినిధులపై మహిళా పోలీసుల విధులకు ఆటంకం, అసభ్య ప్రవర్తన, బెదిరింపుల ఆరోపణలు రావడంతో పోలీసుల దర్యాప్తుపై ఆసక్తి నెలకొంది. ఈ వ్యవహారం రానున్న రోజుల్లో అసెంబ్లీ లోపల, బయట కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఘర్షణకు మరింత ఆజ్యం పోసే అవకాశముంది.

# రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్10, ఆశ్వి అప్డేట్స్:** సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి నకిలీ ఎక్స్ (X) ఖాతాను ఆధారంగా చూపించి సభను తప్పుదోవ పట్టించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శికి ఎమ్మెల్యేలు బండారు లక్ష్మా రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు అందజేశారు.

ముఖ్యమంత్రి సభలో ఫేక్ ఎక్స్ ఖాతాను చూపించి చేసిన వ్యాఖ్యలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. నకిలీ ఖాతాను ఆధారంగా చేసుకుని అసెంబ్లీని తప్పుదోవ పట్టించేలా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈ చర్య ద్వారా సభ గౌరవానికి భంగం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే సీఎం చేసిన నిరాధార ఆరోపణల వల్ల బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రతిష్టకు భంగం కలిగిందని ఎమ్మెల్యేలు ఆరోపించారు. సభలో ఆధారాలు లేని విషయాలను ప్రస్తావించడం సరికాదని, దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ అంశంపై అసెంబ్లీ నిబంధనల్లోని రూల్ 168 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చినట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తెలిపారు. ఇదే అంశంపై అసెంబ్లీ స్పీకర్‌కు కూడా లేఖ రాశారు. సీఎం వ్యాఖ్యలను పరిశీలించి, సభా నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మొత్తంగా నకిలీ ఎక్స్ ఖాతాను అసెంబ్లీలో ప్రస్తావించిన అంశం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మరోసారి రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.



# అసెంబ్లీలో ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి

మొదటిపేజీ తరువాయి

ఎస్సీ సెల్ కార్యక్రమం చేపడితే దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారు అన్నారు. ప్రతిపక్ష కుట్రను బలంగా తిప్పి కొట్టి ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజలకు తెలియజేసిన మిమ్మల్ని అభినందిస్తున్నానన్నారు. జరిగిన సంఘటనలపై విచారణ చేపట్టామన్నారు. సభ్యులు తప్పనిసరిగా సభలో చర్చల్లో పాల్గొనండి. సభలో హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలి. ప్రజలు ఇచ్చిన హోదాను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్ లో రాజకీయంగా రాణించలేరని హెచ్చరించారు. అందరికీ వెసులుబాటుగా ఉండాలని అత్యంత చారిత్రక భవనంలో శాసన మండలి నిర్వహిస్తున్నాం అసెంబ్లీలో సెంట్రల్ హాల్ ను ప్రారంభించుకుని దుద్దిళ్ల శ్రీపాదరావు గారి పేరు పెట్టుకున్నాం. సభలో నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలు ప్రస్తావించాలి. అసెంబ్లీ జరిగినన్ని రోజులు సభ్యుల హాజరు సంపూర్ణంగా ఉండాలి. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎదిగి కాంగ్రెస్ కు నష్టం చేకూర్చాలని చూస్తున్నారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీత లక్ష్మా రెడ్డి, సబితా ఇంద్రా రెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? పోలీస్ సిబ్బందిలో కేటీఆర్ కు రేవంత్ రెడ్డి కనిపించినట్టున్నారని, అందుకనే అంత ఆక్రోశంతో అధికారులపై దాడులు చేశారని వ్యాఖ్యానించారు. దేశానికి మనం చేసిన జనగణన రోల్ మోడల్.

ఇది రాష్ట్రం సాధించిన ఘనత. తెలంగాణ నమూనాను జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. సర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోంది. ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతీ ఒక్కరు ఈ ఓటు హక్కును కాపాడే అంశాన్ని సీరియస్ గా తీసుకోవాలి. మీ ప్రతీ ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుంది. మీ వ్యక్తిగత పనితీరు మీ గెలుపు ఓటముల ను ప్రభావితం చేస్తుంది. సర్ అంశాన్ని సీరియస్ గా పరిగణనలోకి తీసుకోండి. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లు గా తేల్చారు, కానీ ఓటర్ల జాబితా మాత్రం 88 కోట్లుగా చూపుతున్నారు. దేశంలో 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయన్నారు. ఎక్కడో ఏదో ప్రమాదం పొంచి ఉంది. వెయ్యి రోజుల పాలనకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మీ సహకారంతో దేశంలో ఎక్కడా లేని విధంగా కార్యక్రమాలు తీసుకువచ్చామని సీఎం రేవంత్ గుర్తు చేశారు.

# రూ.250 కోట్ల విలువైన భూమి రూ.7కోట్లకే ..

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, ఆశ్వి అప్డేట్స్ :** ముఖ్యమంత్రి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డికి సుమారు రూ.250 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కేవలం రూ.7 కోట్లకే కేటాయించారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూమిని మార్కెట్ విలువకు కాకుండా ఇంత తక్కువ ధరకు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. కేటీఆర్ నేతృత్వంలో మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులు తుక్కుగూడకు గురువారం చేరుకుని భూమిని పరిశీలించారు. సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు కూడా ఉన్నారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఈ భూకేటాయింపుపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ భూములు, రాయితీలు, మినహాయింపులు ఇవ్వడం అధికార దుర్వినియోగం కాదా? ప్రయోజనాల సంఘర్షణ కాదా? కుటుంబ పాలన కాదా? అని నిలదీశారు. మరోవైపు అనుముల జగదీశ్వర్‌రెడ్డికి సంబంధించిన సంస్థకు రూ.1,000 కోట్ల పెట్టుబడి పేరుతో ప్రభుత్వ రాయితీలు, భూములు, మినహాయింపులు కల్పించే వ్యవహారంపైనా కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. ఒకవైపు గ్రేట్ ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి.. మరోవైపు గ్రేట్ పారిశ్రామికవేత్త అనుముల జగదీశ్వర్‌రెడ్డి. ఇద్దరి మధ్య రూ.1,000 కోట్ల పెట్టుబడి ఒప్పందం. దానికి మళ్లీ ప్రభుత్వ రాయితీలు, ప్రభుత్వ భూములు, మినహాయింపులు ఇవ్వాలా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సోదరుడి సంస్థ ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌తో చేసుకున్న ఒప్పందంపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రూ.250 కోట్ల విలువైన భూమిని రూ.7 కోట్లకే కేటాయించిన వ్యవహారంపై బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఈడీ, ఐటీ, సీబీఐలు తమ మీద కేసులు పెట్టడానికే ఉన్నాయా.. అధికారంలో ఉన్నవారి వ్యవహారాలు ఎందుకు కనిపించడం లేదు అని నిలదీశారు. తెలంగాణ కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారిందని ప్రధాని, కేంద్ర హోంమంత్రి ఆరోపిస్తున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ ఏటీఎంగా మారిందని ప్రధాని చెబుతున్నారు.. మరి తెలంగాణను కొల్లగొడుతున్నారని మీరు ఆరోపిస్తున్నప్పుడు దొంగలను పట్టుకోవాల్సిన హోంమంత్రి ఎక్కడున్నారు.. ఇంత పెద్ద వ్యవహారం జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు అని ప్రశ్నించారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు కేంద్ర ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలకు లోబడి ఉంటాయని కేటీఆర్ అన్నారు. ఈ రంగంలోనూ అధికారానికి దగ్గరగా ఉన్న కుటుంబాలకు ప్రయోజనాలు కల్పిస్తున్నారన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలతోపాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలు కూడా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలోకి రావడంపై పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. శాసనసభలో ఈ భూకేటాయింపులు, ఫ్యూచర్ సిటీ, ప్రభుత్వ విధానాలపై ప్రశ్నిస్తామనే తమను సస్పెండ్ చేశారని కేటీఆర్ అన్నారు. 'శాసనసభలో మా గొంతు నొక్కారు.. మీ దోపిడీని సభలో బయటపెడతామనే భయంతో మమ్మల్ని మెడపట్టి బయటకు



పంపారు.. అందుకే మీ తమ్ముడికి ఇచ్చిన భూమి వద్దకే వచ్చాం.. ఇక్కడి నుంచే ప్రజల తరఫున ప్రశ్నిస్తున్నాం' అని అన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాయాజాలం నడుపుతున్నదని కేటీఆర్ ఆరోపించారు. గతంలో ఫార్మాసిటీ కోసం నిర్దిష్ట షరతులతో భూసేకరణ జరిగిందని, ఆ భూములను ఇప్పుడు ఇతర కార్యకలాపాలకు వినియోగించడం చట్టపరంగా ప్రశ్నార్థకమని అన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామికవేత్తలు ఈ న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఫ్యూచర్ సిటీ భవిష్యత్తుపై న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి.. రేపు కోర్టులో ఈ భూములపై వివాదాలు తలెత్తితే నష్టపోయేది పెట్టుబడులు పెట్టిన పారిశ్రామికవేత్తలే. రేవంత్‌రెడ్డి కుటుంబ ప్రయోజనాల కోసం జరుగుతున్న రియల్ ఎస్టేట్ మాయాజాలంలో పెట్టుబడిదారులు బలిపశువులు కావద్దు అని కేటీఆర్ హెచ్చరించారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తే సామాన్యులు, యువత, రైతులకు కూడా ఇదే తరహాలో ప్రభుత్వ భూములు, రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాము రూ.లక్ష మూలధనంతో పెట్టుబడి పెడతామని వస్తే రూ.200 కోట్ల విలువైన స్థలం ఇస్తారా.. మాకూ అదే రాయితీలు, మినహాయింపులు ఇస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలిపెట్టబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. అవసరమైతే ప్రజా కోర్టును ఆశ్రయిస్తామని, రంగారెడ్డి జిల్లాలోని ప్రతి గ్రామంలో సదస్సులు నిర్వహించి భూకేటాయింపులు, ఫ్యూచర్ సిటీ పేరుతో జరుగుతున్న వ్యవహారాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అవసరమైన అన్ని న్యాయ, ప్రజాస్వామ్య మార్గాలను అన్వేషించి పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. మీడియా కూడా ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం చూపిస్తున్న రంగుల కల వెనుక ఉన్న న్యాయపరమైన అంశాలను ప్రజలకు వివరించాలని కేటీఆర్ కోరారు. పెట్టుబడిదారులు భవిష్యత్తులో నష్టపోయే అవకాశం ఉన్న అంశాలను కూడా వెలుగులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి పదవిని ఉపయోగించుకుని కుటుంబ సభ్యులకు ప్రభుత్వ భూములు, రాయితీలు, పెట్టుబడి ప్రయోజనాలు కల్పించడం అధికార దుర్వినియోగం కాదా.. కుటుంబ పాలన కాదా.. ప్రయోజనాల సంఘర్షణ కాదా అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ప్రజల సొమ్ము, ప్రభుత్వ భూముల విషయంలో జవాబుదారీతనం, పారదర్శకత ఉండాల్సిందేనని, ఈ భూవ్యవహారంపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# నీరున్నా పంటలను కాపాడలేని ప్రభుత్వం

- ఇది రేవంత్ తెచ్చిన కరువు
- రాష్ట్ర రైతుకు నీరు నిల్.. ఏపీకి ఫుల్
- ఇదీ ప్రభుత్వ నిర్వాకం
- మోటార్లను పూర్తిస్థాయిలో ఎందుకు నడపరు?
- పాలమూరుకు నీరందించలేని దద్దమ్మ ప్రభుత్వం
- నిప్పులు చెరిగిన హరీష్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, ఆశ్వి అప్డేట్స్:** కండ్ల ముందు నీళ్లు పారుతున్నా పొలాలకు నీళ్లు ఇవ్వలేని పాలన. పంటలను కాపాడలేని పరిస్థితి. ఇది కాలం తెచ్చిన కరువు కాదు రేవంత్ రెడ్డి తెచ్చిన కరవు అని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలమూరు బిడ్డను అని విర్రవీగే ఈ రేవంత్ రెడ్డి కృష్ణా జలాలు ఎత్తకుండా పాలమూరు ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నడన్నారు. రాష్ట్ర రైతాంగానికి నీళ్లు నిల్లు.. ఏపీ రైతాంగానికి నీళ్లు ఫుల్లు అని ఆరోపించారు. ఎల్ నినో ప్రమాదం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థలు చెబుతున్నప్పుడు వచ్చిన నీళ్లు వచ్చినట్లు ఎత్తకుండా చోద్యం చూస్తున్నాడన్నారు. ఎత్తగలిగే అవకాశం ఉండి మోటార్లు బంద్ పెట్టి కూర్చున్నడని ఆరోపించారు. తెలంగాణ తెచ్చిన పార్టీగా తమకు బాధ్యత ఉందన్నారు. రేవంత్ రెడ్డికి తన గురువు బాగుంటే చాలు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మొదటి పంప్ హౌజ్ ఎల్లూరు పంప్ హౌజ్ కేవలం రెండు మోటార్లు నడుస్తున్నాయి. మిగతా ఎందుకు బంద్ పెట్టావు.. ఆ రెండు కూడా ఆన్ అండ్ ఆఫ్ లో నడుస్తున్నాయి. సగటున 11 గంటలే మోటార్లు నడుపుతున్నారు. 24 గంటలు 5 మోటార్లు నడపాలి కానీ లేదు. రోజుకు 1600 క్యూసెక్కులు రావాల్సిన చోట 700 క్యూసెక్కులే వస్తున్నాయి. 4000 క్యూసెక్కులు ఎత్తగలిగే కెపాసిటీ ఉంటే రేవంత్ రెడ్డి ఎత్తుతున్నది 700 క్యూసెక్కులు. నీ ప్రాంతం మీద నీకున్న ప్రేమ వట్టి మాటలే. బాబుకి గురు దక్షిణ చెల్లించుకుంటున్నవా.. వెలిగొండ, పోతిరెడ్డిపాడు ద్వారా నీళ్లు తరలించుకుపోయేందుకు సహకరిస్తున్నవా అని ఆయన ప్రశ్నించారు. బీమా ప్రాజెక్టులో మూడు మోటార్లు ఉంటే ఒకటి నడుపుతున్నారు.. బేసిన్ తో సంబంధం లేని వెలిగొండ ద్వారా చంద్రబాబు నీళ్లు తీసుకుపోతుంటే బేసిన్ లో ఉండి, నికర జలాల కేటాయింపు ఉన్న బీమా ఎందుకు నడపట్టేదని హరీష్‌రావు ప్రశ్నించారు. నెట్టంపాడులో నాలుగు ఉంటే ఒకటి, కోయిల్ సాగర్ లో మూడు ఉంటే ఒకటి నడుపుతున్నరు. నీళ్లు ఉండి మోటార్లు నడపడం చేతగాని ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్న. అసెంబ్లీలో తాము ప్రజల తరఫున మాట్లాడితే మార్షల్స్ పెట్టి మమ్మల్ని ఎత్తేసావు. మమ్మల్ని కాదు మోటార్లు ఆన్ చేసి కృష్ణా నీళ్లు ఎత్తు. రేవంత్ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ వరప్రదాయిని అయిన కృష్ణా నీళ్లు ఏపీకి వరప్రదాయినిగా మారాయన్నారు. పాలమూరు, నల్లగొండ జిల్లాలకు నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నారు.. సాగు, తాగు నీళ్ల కోసం తండ్లాడుతున్నారు.. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో రైతులు అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్నరు.. పొంగులేటి నియోజకవర్గంలో రైతులు ధర్నాలు చేస్తున్నరు.. రాష్ట్రవ్యాప్తంగా సబ్ స్టేషన్ల ముందు రైతులు ధర్నా చేస్తున్నరు అని తెలిపారు. రోమ్ తగలబడుతుంటే ఫిడేల్ వాయించినట్లు సస్పెన్షన్‌ల బిజీలో ఉన్నడు అని హరీష్‌రావు ఘాటుగా విమర్శించారు. నీళ్లు ఉండి నీళ్లు ఎత్తరు, ఉత్పత్తి కెపాసిటీ ఉండి కరెంట్ ఉత్పత్తి చేయడం లేదు. కేటీపీఎస్ 800 మెగావాట్ల ప్లాంటు మూసేసారు. 540 మెగావాట్ల బీటీపీఎస్ యూనిట్ 3,4 ప్లాంట్లు మూసేసారు. యాదాద్రిలో 4000 మెగావాట్లకు ఉత్పత్తి చేస్తున్నది. 2000 మెగావాట్లు ఒకవైపు బొగ్గు సర్ ప్లస్ ఉంది అంటున్నరు. మరోవైపు యాదాద్రి ప్లాంటుకు బొగ్గు సరఫరా చేయడం లేదన్నారు. కొండారెడ్డిపల్లిలో ధర్నా చేస్తున్న రైతులు, పొంగులేటి నియోజకవర్గంలో చేస్తున్న రైతులు బిఆర్ఎస్ కార్యకర్తలా అని ప్రశ్నించారు. కల్వకుర్తి, బీమా, నెట్టంపాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్టులు 4000 కోట్లు ఖర్చు చేసి, పూర్తి చేసి ఆరున్నర లక్షల ఎకరాలకు



నీళ్లు ఇచ్చినం. మూడేళ్లలో ఇహెచ్టీ సబ్ స్టేషన్ ఒక్కటీ కట్టలేదు. రైతులకు ఇచ్చే పవర్ లేదు. ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి మాత్రం పవర్ ఉపయోగిస్తరన్నారు. కోమటి రెడ్డి నాడు కరెంట్ లేదని ఆయన విమర్శలు చేసారు.. ఇప్పుడు 7 గంటలు కూడా కరెంట్ వస్తలేదు, ఎందుకు లాగ్ బుక్స్ చూడటం లేదు. రేవంత్ రెడ్డిని చూస్తే లాగులు తడుస్తున్నాయా అని ప్రశ్నించారు. శ్రీశైలంలో మనకు ఉన్నవి కల్వకుర్తి, పాలమూరు ప్రాజెక్టులు. పాలమూరు ప్యాకేజీ3లో నెల రోజులు కష్టపడితే పూర్తి అవుతుంది. మూడేళ్ల నుంచి ఆ పని చేయడం లేదు. 5,6 లక్షల ఎకరాలకు నీళ్లు వస్తయి. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టు అని, కేసీఆర్ కు కీర్తి వస్తుందని పనులు పూర్తి చేయడం లేదు. పాలమూరు ప్యాకేజీ ని పడావు పెట్టినవు అధికారిక లెక్కల ప్రకారమే శ్రీశైలం నుంచి 35 టీఎంసీలు ఏపీ తీసుకుపోయింది. కానీ రేవంత్ ఎత్తింది కేవలం 7 టీఎంసీలు బిఆర్ఎస్ పోరాటం చేస్తే మొన్న కేటీఆర్ వెళ్తే సాగర్ కు కొద్దికొద్దిగా నీళ్లు ఇస్తున్నరు. బిఆర్ఎస్ నిలదీస్తే తప్ప మొద్దు నిద్ర వీడరా అని నిలదీశారు. ప్రకృతి వైపరీత్యం కాదు.. కాంగ్రెస్ వైపరీత్యం వచ్చింది. బేసిన్ లో లేని వెలిగొండకు నీళ్లు.. బేసిన్ లో ఉన్న మహబూబ్ నగర్ కు నీళ్లు లేని పరిస్థితి. 2024-25లో 28.49 శాతం, 2025-26లో 25.77శాతం మాత్రమే నీటి వినియోగం జరిగింది. ఆరు లక్షల ఎకరాలకు క్రాప్ హాలిడే ప్రకటించిన చేవలేని ప్రభుత్వం మీది. ఈ ఏడాది కూడా అదే తీరుగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత అతి తక్కువ కృష్ణా జలాల వినియోగం జరిగింది ఈ మూడేళ్ల కాలంలోనే అని అన్నారు. ఎవర్ లోయెస్ట్ యుటిలైజేషన్ ఉన్న తాత్కాలిక వాటాను కూడా వాడుకోలేని చేతగాని ప్రభుత్వం ఇది. రైతులకు కావాల్సింది బూతులు కాదు.. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు కాదు.. పంపులకు పవర్, పొలాలకు సాగునీరు. ఎల్ నినో ప్రకృతి వైపరీత్యం కావచ్చు.. కానీ నీరు అందుబాటులో ఉండి కూడా రైతుకు అందించకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. కాంగ్రెస్ వైపరీత్యం. ముఖ్యమంత్రిగా మీ మౌనం తెలంగాణ తాగు, సాగునీటి ప్రయోజనాలకు శాపంగా మారుతోందన్నారు. ఏపీ నీటి తరలింపుకు వెంటనే అడ్డుకట్ట వేయాలి. అవసరం అయితే అపెక్స్ కౌన్సిల్ డిమాండ్ చేయాలి. పాలమూరు అన్ని ప్రాజెక్టుల మోటార్లు ఆన్ చేసి పొలాలకు నీళ్లు ఇవ్వాలి సాగర్ కాల్వకు నీళ్లు ఇవ్వాలి, నల్లగొండ పొలాలకు నీళ్లు మళ్లించాలి అని హరీష్‌రావు డిమాండ్ చేశారు. వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. పరిస్థితులు బాలేదు... అసెంబ్లీలో మాట్లాడమని ఫోన్లు చేస్తున్నరు. దీన్ని అడుగుతం అని మమ్మల్ని సభ నుంచి సస్పెండ్ చేసిండు. వర్షాల కారణంగా ఎస్ఆర్ఎస్పీలో 46టీఎంసీల నీళ్లు ఉన్నయి. గుత్ప అలీ సాగర్ లిఫ్టులు ప్రారంభించి చెరువులు నింపాలని డిమాండ్ చేస్తే తూతూమంత్రంగా గుత్ప లిఫ్టులు ఆన్ చేసారు. నాలుగు మోటార్లకు గాను ఒక్క మోటార్ నడిపిస్తున్నరు. వెంటనే పూర్తి స్థాయి గుత్ప లిఫ్టు నడపాలి. నాలుగు మోటార్లు నడిపి అన్ని చెరువులు నింపాలి. అలీ సాగర్ కెపాసిటీ 720. నాలుగు మోటార్లకు గాను సగమే నడుపుతున్నరు. అది కూడా ఆన్ అండ్ ఆఫ్ గా నడుపుతున్నరు. గుత్ప, అలీసాగర్ కలిపి రోజుకు 1260 క్యుసెక్కులు, నెల రోజులు నడిపినా 3 టీఎంసీలు మాత్రమే. అలా చేస్తే ఉన్న చెరువులు అన్ని నిండుతాయి. బాల్గొండ నియోజకవర్గంలో ఉన్న లక్ష్మీ కెనాల్ కు నిండుగా నీళ్లు ఇవ్వాలి. చౌటుపల్లి హన్మంతరెడ్డి లిఫ్టు సహా ఇతర అన్ని లిఫ్టులు ఆన్ చేయాలి.

# వినాయక చవితి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- నిమజ్జనానికి రూట్‌మ్యాప్‌లు, క్రేన్లు, బారికేడ్లు, వైద్య శిబిరాల ఏర్పాటు



**వికారాబాద్ | సెప్టెంబర్ 10 | ఆశ్వి అప్డేట్స్:**

వికారాబాద్ జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 14న వినాయక చవితి సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. గణేష్ నిమజ్జనానికి అవసరమైన రూట్‌మ్యాప్‌లను సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చోట్ల రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు.

**నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు**

నిమజ్జన ప్రదేశాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, ఫస్ట్‌ఎయిడ్ కిట్లతో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. భారీ క్రేన్లు, బారికేడ్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిమజ్జనం సాయంత్రం వేళల్లో జరిగే అవకాశం ఉన్నందున నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ తీగల వల్ల ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు చేపట్టి, ప్రతి నిమజ్జన ప్రదేశంలో విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. గణేష్ మండపాలకు నిబంధనల ప్రకారం విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గణేష్ నవరాత్రులు ప్రారంభమైనప్పటి నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలని, అగ్ని ప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై మండపాల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

**డీజేలకు అనుమతి లేదు**

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ.. గణేష్ నిమజ్జనం సందర్భంగా జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులతో సమన్వయం చేసుకుంటూ వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు అధికారిక ఆన్‌లైన్ ఇంటిమేషన్ ఫారం ద్వారా విగ్రహానికి సంబంధించిన వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదైన వివరాల ఆధారంగా పోలీసు బందోబస్తును పటిష్టంగా ఏర్పాటు చేస్తామని చెప్పారు.

**రహదారులకు ఇబ్బంది లేకుండా మండపాలు**

గణేష్ మండపాలను రహదారులను పూర్తిగా నిరోధించే విధంగా ఏర్పాటు చేయరాదని ఎస్పీ సూచించారు. ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా తగిన ప్రదేశాల్లో మండపాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రాత్రి వేళల్లో మండపాల వద్ద వాలంటీర్లు అందుబాటులో ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. హిందూ సంప్రదాయాలకు అనుగుణంగా భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలని, ప్రతి మండపం వద్ద అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఎస్పీ కోరారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు ఉత్సవ కమిటీ సభ్యులు గణేష్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి తమ సూచనలు, సలహాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూరు, డీఆర్వో స్వర్ణలత, వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ ఉత్సవ కమిటీల సభ్యులు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌కు పితృవియోగం

- అంత్యక్రియల్లో పాల్గొని బోడ సమ్మయ్యకు నివాళులర్పించిన ఎమ్మెల్యే మాణిక్‌రావు
- కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన ఎమ్మెల్యే



**జహీరాబాద్ | సెప్టెంబర్ 10 | ఆశ్వి అప్డేట్స్:**

న్యాల్కల్ మండల మాజీ జెడ్పీటీసీ భాస్కర్ తండ్రి బోడ సమ్మయ్య మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు గురువారం నిర్వహించగా, జహీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హాజరై సమ్మయ్య పార్థివదేహానికి ఘన నివాళులర్పించారు. పార్థివదేహాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న భాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, సమ్మయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన భాస్కర్ కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ అంత్యక్రియల కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, ఝరాసంఘం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, కోహీర్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ కమిటీల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని బోడ సమ్మయ్యకు నివాళులర్పించారు.

# పోలీస్ డ్రైవర్ల ఎంపికకు డ్రైవింగ్ టెస్ట్

- సురక్షిత డ్రైవింగ్, వాహన నిర్వహణపై సిబ్బందికి అవగాహన
- నైపుణ్యం, రహదారి భద్రత ఆధారంగా అర్హులైన వారిని ఎంపిక



**వికారాబాద్ | సెప్టెంబర్ 10 | ఆశ్వి అప్డేట్స్:**

వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖలోని ఎం.టి. (మోటార్ ట్రాన్స్‌పోర్ట్) సెక్షన్‌లో డ్రైవర్ల ఎంపికకు పోలీస్ సిబ్బందికి డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పరేడ్ గ్రౌండ్‌లో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ పరీక్ష జరిగింది. పోలీస్ వాహనాల నిర్వహణతో పాటు డ్రైవింగ్ విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అర్హులైన సిబ్బందిని డ్రైవర్లుగా ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా డ్రైవింగ్ నైపుణ్యాలను పరీక్షించారు.

**సురక్షిత డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి**

కార్యక్రమానికి జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా, ఐపీఎస్ హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాహనాల నిర్వహణ, సురక్షిత డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, విధి నిర్వహణలో అప్రమత్తత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పోలీస్ డ్రైవర్లు వాహనాలను అత్యంత బాధ్యతాయుతంగా, నిబంధనలకు అనుగుణంగా, సురక్షితంగా నడపాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా అప్రమత్తంగా వ్యవహరిస్తూ రహదారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

**నైపుణ్యం ఉన్న సిబ్బందికి అవకాశం**

డ్రైవింగ్‌లో నైపుణ్యం, వాహనాలపై అవగాహన, రహదారి భద్రతా ప్రమాణాలపై పట్టును పరిగణనలోకి తీసుకుని అర్హులైన సిబ్బందిని ఎంపిక చేయనున్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. పోలీస్ వాహనాల నిర్వహణ, సిబ్బంది విధుల సమర్థవంతమైన నిర్వహణలో డ్రైవర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ డ్రైవింగ్ టెస్ట్‌లో ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగార్జున, ఎంవీఐ కే. శ్రీనివాసులు, ఆర్ఐ శ్రీశైలం, ఆర్ఐ నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు .. పేదల ఆత్మగౌరవానికి తగినట్టు

- ఇళ్లకు రూ.5 లక్షల ఉచిత సాయం ఎక్కడా లేదు
- రెండో విడతలో 59 వేల గుడిసెల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు
- ఏ నియోజకవర్గంలోని పేదలకు ఆ నియోజకవర్గంలోనే
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 , ఆశ్వి అప్డేట్స్:**

పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శాసనసభలో ఎమ్మెల్యేలు మనోహరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితర సభ్యులు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గురువారం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పేదలను వారి జీవనోపాధికి దూరంగా 3040కి.మీ అవతలికి పంపించే విధానం తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎకరం రూ.150200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లో కూడా పేదవాడి ఆత్మగౌరవానికి తగినట్లుగా ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. డ్రాలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు డ్రాలో ఎంపికైనట్లు తేలితే వారి పేర్లను తప్పనిసరిగా తొలగిస్తామని సభ సాక్షిగా స్పష్టం చేశారు. ప్రధానమైన సిమెంట్ ధరను పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సిమెంట్ కంపెనీలతో చర్చలు జరిపామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో రూ.310320 ఉన్న 50 కేజీల సిమెంట్ బ్యాగ్‌ను రూ.230కే పేదలకు అందించేలా ఒప్పందం పూర్తి చేశామని, త్వరలో అమల్లోకి వస్తుందని చెప్పారు. స్టీల్‌ను కూడా తక్కువ ధరకు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

**రూ.5 లక్షలు ఉచితంగా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ**

దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా అందించిన ఉదాహరణ లేదని, తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రూ.5 లక్షలు సరిపోవడం లేదని పలువురు సభ్యులు సూచించారని, ఆ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు.

**8 లక్షల ఇళ్లకు సుమారు రూ.40 వేల కోట్ల భారం**

మొదటి విడతలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.22,500 కోట్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.11 వేల కోట్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు సుమారు రూ.5,500 కోట్లు అవసరమవుతాయని మంత్రి వివరించారు. రెండు విడతల్లోనే సుమారు 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన పేదలకు ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

**చిన్న లోపాలతో ఆగిన 3,200 ఇళ్లకు పరిష్కారం**

మొదటి విడతలో ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు ప్రారంభించి నిర్మాణంలో చిన్నచిన్న లోపాల కారణంగా నిలిచిపోయిన సుమారు 3,200 ఇళ్లను రాటిఫై చేసి క్లియర్ చేశామని మంత్రి తెలిపారు. వారందరికీ ఈ వారం చివర్లోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలో రాజకీయ వివక్షతో ఇళ్ల కేటాయింపులు జరిగాయని విమర్శించిన మంత్రి తమ ప్రభుత్వం మాత్రం అర్హతే ప్రామాణికంగా ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. ప్రతిపక్ష సభ్యులు సూచించిన అర్హులైన పేదల పేర్లను కూడా పరిశీలించి, అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఎక్కడైనా అర్హులైన పేదలకు అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

**పాత ప్రభుత్వ స్థలాల్లో నెల రోజుల్లో పేదలకు ఇళ్ల స్థలాలు**

గతంలో ఉమ్మడి ఏపీలో పేదల కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాలు, సేకరించిన భూముల్లో ఇంకా కేటాయింపులు జరగని స్థలాలను గుర్తించి అర్హులైన పేదలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నెల రోజుల్లోగా ఆయా నియోజకవర్గాల్లో అర్హులైన పేదలకు ఈ స్థలాలు అందించేలా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు.

**రాష్ట్రంలో 59 వేల గుడిసెలకు రెండో విడతలో ప్రాధాన్యత**

దశాబ్దాలుగా గుడిసెల్లోనే జీవిస్తున్న పేదలకు రెండో విడతలో శుభవార్త అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన సుమారు 59 వేల గుడిసెలను రెండో విడతలో ప్రాధాన్యతగా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలోని 20 నియోజకవర్గాల్లో పైలట్ మోడల్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశామని, వారి భౌతిక పరిశీలన పూర్తి చేసి తుది జాబితా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది బోనాల పండుగ నాటికి హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్‌లో గృహప్రవేశాలు జరిగేలా కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. హైదరాబాద్‌తోపాటు ఇతర కార్పొరేషన్లలోనూ ఇదే విధానాన్ని పైలట్ మోడ్‌లో అమలు చేస్తున్నామని, అవసరమైతే మున్సిపాలిటీల్లోనూ పరిశీలిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**అసంపూర్తి 2బీహెచ్‌కేలకు రూ.750 కోట్ల చెల్లింపులు**

గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన 2బీహెచ్‌కే ఇళ్లను పూర్తి చేయడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం రూ.600 కోట్లకు పైగా ఖర్చు చేసిందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా వదిలిన ఆ ఇళ్లకు సుమారు రూ.750 కోట్ల బిల్లులు చెల్లించామని చెప్పారు. గతంలో వివిధ కారణాలతో సొంత డబ్బులతో ఫౌండేషన్, గోడలు లేదా స్లాబ్ వరకు నిర్మించి ఆగిపోయిన ఇళ్లకు కూడా ఈసారి ప్రత్యేక అవకాశం కల్పించామని మంత్రి తెలిపారు. రెండో విడతలో ప్రతి 2,000 ఇళ్లలో 500 ఇళ్లను అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కేటాయించే కొత్త విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు.

**డ్వాక్రా మహిళలకు రూ.లక్ష అడ్వాన్స్**

ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని డ్వాక్రా మహిళా సంఘాల్లో సభ్యులైన పేదలకు రూ.లక్ష అడ్వాన్స్‌గా అందించే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. పేదలు గుడిసెల నుంచి స్లాబ్ వేసిన ఇందిరమ్మ ఇళ్లలోకి మారేలా ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకోవాలని కోరారు.

# నిధుల వినియోగానికి స్వేచ్ఛ అవసరం

- అందుకే పంచాయతీరాజ్ చట్టం-2018కు సవరణ
- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మంత్రి సీతక్క
- ఏకగ్రీవంగా శాసన సభ ఆమోదం

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, ఆశ్వి అప్డేట్స్ :**


గ్రామ పంచాయతీకి వచ్చే డబ్బు గ్రామాభివృద్ధికే ఉపయోగపడాలి.. ఆదాయం గ్రామ అవసరాలకు అందుబాటులో ఉండాలి.. నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలి.. ప్రజలకు జవాబుదారీతనం ఉండాలి.. ఇదే ప్రజా ప్రభుత్వ విధానం అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. దేశంలో గ్రామీణ స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు 73వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చారు. గ్రామ పంచాయతీలు కేవలం ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేసే సంస్థలుగా కాక ప్రజలకు దగ్గరగా ఉండే స్వయం పాలనా సంస్థలుగా పనిచేయాలన్నదే దాని ప్రధాన ఉద్దేశం అని చెప్పారు. అయితే స్థానిక సంస్థలకు అధికారాలు, బాధ్యతలతోపాటు వాటికి అవసరమైన ఆర్థిక వనరులు కూడా ఉండాలన్నారు. పంచాయతీలకు కొన్ని పన్నులు, సుంకాలు, ఫీజులు వసూలు చేసుకునే అధికారాలను కూడా కల్పించారని చెప్పారు. రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల ఏర్పాటు, పారిశుధ్యం నిర్వహణ, వీధి దీపాలు ఏర్పాటు, తాగునీటి సరఫరా వంటి అనేక ప్రాథమిక పౌర సేవల బాధ్యతలు ఉన్నాయి. జీపీలకు ఆదాయం సమకూర్చుకునే అధికారం ఇచ్చి ఆ ఆదాయాన్ని అవసరమైన సమయంలో వినియోగించుకునే స్వేచ్ఛ లేకపోతే స్థానిక స్వపరిపాలన ఎలా బలపడుతుంది అని మంత్రి ప్రశ్నించారు. ఇదే ప్రశ్నకు సమాధానంగా రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం2018లోని సెక్షన్ 70లోని సబ్ సెక్షన్ 3కు సవరణ చేస్తూ బిల్లును ప్రవేశపెడుతున్నామన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు తమ సొంత ఆదాయ వనరుల ద్వారా సమకూర్చుకునే నిధులను ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ చేయాల్సి వస్తోంది. ఆ తర్వాత ఆ నిధులను వినియోగించుకోవాలంటే ట్రెజరీ ద్వారా డ్రా చేసుకోవాలి. దీనికి ఒక నిర్దిష్టమైన ప్రక్రియ ఉంటుంది. దీని వల్ల కొన్నిసార్లు నిధుల వినియోగంలో ఆలస్యం జరుగుతోంది. గ్రామంలో సమస్య వస్తుంది.. కానీ దాన్ని పరిష్కరించడానికి అవసరమైన డబ్బు అందుబాటులోకి రావడానికి ఎందుకు ఆలస్యం కావాలి.. ఆ డబ్బును వినియోగించుకునే ప్రక్రియలో ఆలస్యం జరిగితే ప్రజలు ఇబ్బందులు పడతారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లుగానే జీపీ సొంత ఆదాయం కూడా బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా చట్టాన్ని సవరిస్తున్నాం అని మంత్రి చెప్పారు.

**గ్రామ సభ తీర్మానం మేరకు అవసరాలకు ఖర్చు చేసుకోవచ్చు**

మున్సిపాలిటీల్లో సొంత ఆదాయాన్ని బ్యాంకు ఖాతాల్లో వేసుకోవచ్చు.. కానీ పంచాయతీలకు ఆ వెసులుబాటు లేదు.. పంచాయతీల మీద గత ప్రభుత్వం వివక్ష చూపింది.. దాన్ని రూపుమాపడానికి చట్ట సవరణ చేస్తున్నాం.. గ్రామ సభ తీర్మానం మేరకు అవసరాలకు ఖర్చు చేసుకోవచ్చు. బీసీ రిజర్వేషన్ల కారణంగా పంచాయతీ ఎన్నికలు ఆలస్యం అయ్యాయి.. ఆ కాలానికి సంబంధించి కేంద్రం నుంచి నిధులు పూర్తి స్థాయిలో రాలేదు.. ప్రతి నెలా జీపీల కోసం రూ.50 కోట్లు వెచ్చిస్తున్నాం.. 202526 ఏడాదికి సంబధించి సెకండ్ ఇనస్టాల్‌మెంట్ రూ.619 కోట్లు రావాల్సి ఉంది.. మొదటి తేదీనే మల్టీ పర్పస్ వర్కర్లకు జీతాలు ఇస్తున్నాం.. కేంద్రం నూతన విధానాల కారణంగా గ్రామాల అభివృద్ధిపై ప్రభావం చూపుతోంది.. వీజీజీ రాంతో రాష్ట్రాలపై రూ. 2 వేల కోట్ల అదనపు భారం పడుతుంది.. అయినా తాము పెద్ద ఎత్తున వీబీ జీ రాంజీ పనులు చేయిస్తున్నాం.. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, పొలానికి పంట కుంట, ఊరికి ఉట కుంటను నిర్మిస్తున్నాం.. ప్రతి గ్రామానికి పక్కా రహదారి ఉండాలని సీఎం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారు. ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి డబుల్ రోడ్డు ఇస్తున్నాం. హ్యామ్ విధానంలో వేల కిలోమీటర్లు నిర్మిస్తున్నాం.. ఫారెస్టు ప్రాంతాల్లో కేంద్ర అటవీ చట్టాలు రోడ్ల నిర్మాణానికి అడ్డంకులు ఎదురవతున్నాయి.. దీంతో ప్రజల" ఇబ్బందులు పడుతున్నారు.. కేంద్ర ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ ఇప్పించాలి అని అన్నారు. ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌పై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. బిల్లును అమోదించాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేయగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. శాసనమండలిలోనూ పంచాయతీరాజ్ సవరణ బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం లభించింది.

# గణేష్ నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

మొదటిపేజీ తరువాయి



స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని స్పష్టం చేశారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్ ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తు చేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయన్నారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా బేబీ పాండ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎలాంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

# కరెంటు కోతలతో మళ్లీ పాత రోజులు: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి



విమర్శలు గుప్పించారు.

**సీఎం సొంత ఊరిలోనూ కరెంటు కోతలే..**

'కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. ఇదేనా కాంగ్రెస్ తెచ్చిన మార్పు?' అంటూ కేటీఆర్ వ్యంగ్యంగా ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లాలోని ఆయన సొంత గ్రామంలోనూ రైతులు విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతున్నాయని, మోటార్లు పనిచేయక సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు.

**మళ్లీ పాత కష్టాలేనంటూ..**

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్నదాతలకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించామని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులు మళ్లీ విద్యుత్ కష్టాలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు. సీఎం సొంత గ్రామంలోని పరిస్థితులే రాష్ట్రంలో విద్యుత్ సరఫరా తీరుకు నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

## స్పీకర్‌పై వ్యాఖ్యల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు షాక్?

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలకు సంబంధించి న్యాయపరమైన ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటికే ఇద్దరికీ మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సైఫాబాద్ పోలీసులు నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. కోర్టు విధించిన షరతులను ఉల్లంఘించడంతోపాటు దర్యాప్తు, సాక్ష్యాలను ప్రభావితం చేసేలా వ్యవహరించారని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు.

**అసెంబ్లీ వద్ద ఆందోళనతో కేసు**

అసెంబ్లీ వద్ద జరిగిన ఆందోళన సందర్భంగా పోలీసులతో వాగ్వాదానికి దిగడం, విధులకు ఆటంకం కలిగించడం, స్పీకర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయడంపై సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో పోలీసులు రిమాండ్ కోరినప్పటికీ నాంపల్లి కోర్టు ఇద్దరు ఎమ్మెల్సీలకు బెయిల్ మంజూరు చేసింది. అయితే బెయిల్ సమయంలో విధించిన నిబంధనలకు విరుద్ధంగా వారు వ్యవహరించారని పోలీసులు ఆరోపిస్తూ బెయిల్ రద్దు పిటిషన్ దాఖలు చేశారు.

**ఎస్సీ, ఎస్టీ కోర్టుకు బదిలీ చేయాలని..**

కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విచారణను ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టుకు బదిలీ చేయాలని కూడా పోలీసులు నాంపల్లి కోర్టును కోరారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడంతో ఆయనపై చేసిన వ్యాఖ్యలకు అట్రాసిటీ చట్టంలోని నిబంధనలు వర్తిస్తాయని పోలీసులు పేర్కొన్నారు. దీంతో ఈ వ్యవహారం మరింత కీలకంగా మారింది.

**బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం**

పోలీసుల చర్యలపై బీఆర్ఎస్ తీవ్రంగా మండిపడుతోంది. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ప్రభుత్వం వరుస కేసులు, పిటిషన్లతో ఎమ్మెల్సీలను వేధిస్తోందని ఆరోపించింది. తాతా మధు, నవీన్‌రెడ్డి ఎలాంటి నిబంధనలను ఉల్లంఘించలేదని, చట్టపరంగానే వ్యవహరిస్తూ కోర్టులో కేసును ఎదుర్కొంటామని బీఆర్ఎస్ న్యాయ విభాగం నేతలు చెబుతున్నారు.

**కోర్టు ఉత్తర్వులపై ఉత్కంఠ**

బెయిల్ రద్దు, కేసు బదిలీపై నాంపల్లి కోర్టు త్వరలో విచారణ చేపట్టనుంది. బెయిల్ రద్దయితే ఇద్దరు ఎమ్మెల్సీలు తిరిగి జైలుకు వెళ్లే పరిస్థితి ఏర్పడొచ్చు. కేసు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టుకు బదిలీ అయితే తదుపరి విచారణ అట్రాసిటీ చట్టం పరిధిలో కొనసాగనుంది. ఈ పిటిషన్లపై న్యాయస్థానం ఇచ్చే ఉత్తర్వులపై తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో మళ్లీ వేడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, ఆశ్వి అప్డేట్స్:**

అసెంబ్లీలో సీఎల్పీ సమావేశం అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు మరోసారి పార్టీలో చర్చకు దారితీశాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తనకు భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని, వాటిని సీఎం, తన మధ్య వ్యక్తిగత విభేదాలుగా చిత్రీకరించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు. మంచి జరిగితే మంచని, తప్పు జరిగితే తప్పని నిర్భయంగా చెప్పడం తన స్వభావమని స్పష్టం చేశారు.

**మంత్రి పదవిపై కీలక వ్యాఖ్యలు**

తనకు మంత్రి పదవి దక్కుతుందన్న ప్రచారంపైనా రాజగోపాల్‌రెడ్డి స్పందించారు. మంత్రి పదవి ఇవ్వడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతిలో ఉండదని, అది పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పారు. పదవి కోసం తాను ఎప్పుడూ రాజీపడలేదని స్పష్టం చేశారు.

**ప్రచారంపై మండిపాటు**

ముఖ్యమంత్రిని కలిస్తే రాజీపడ్డారని, కలవకపోతే ఇద్దరి మధ్య దూరం పెరిగిందని కొందరు ప్రచారం చేయడం సరికాదని రాజగోపాల్‌రెడ్డి మండిపడ్డారు. తన రాజకీయ వైఖరిని వ్యక్తిగత సంబంధాలతో ముడిపెట్టి తప్పుడు ప్రచారం చేయొద్దని ఆయన సూచించారు.

## అత్యంత బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారు

- **తుమ్మల పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 , ఆశ్వి అప్డేట్స్:**



వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గుర్తించి మెచ్చుకోవడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు. 'మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు' అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని, ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.

## పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, ఆశ్వి అప్డేట్స్:**

హైదరాబాద్ శివారులో ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన ఘటన కలకలం రేపింది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని బాటసింగారం వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు రెండు కార్లు, ఓ ఆటోను ఢీకొట్టగా అవి ధ్వంసమయ్యాయి. అంతేకాక డీజిల్ పంపును కూడా బస్సు ఢీకొనడంతో బంకు పరిసరాల్లో ఒక్కసారిగా భయానక పరిస్థితి నెలకొంది. ప్రమాదం జరిగిన సమయంలో పెట్రోల్ బంకు వద్ద పెద్దగా జనసంచారం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నప్పటికీ అదృష్టవశాత్తూ పెను ముప్పు తప్పింది. బస్సు అదుపుతప్పి బంకులోకి దూసుకెళ్లిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయింది. బైక్‌ను తప్పించబోయే సమయంలోనే బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోయినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బస్సు డ్రైవర్ పరిస్థితి, ప్రమాద సమయంలో వాహనం వేగం, ఇతర సాంకేతిక కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తూ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలో మరో రోడ్డు ప్రమాదం జరిగింది. దుర్గాపురం స్టేజ్ సమీపంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు లారీల క్యాబిన్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

# రూ.కోటి బీమా.. దేశంలోనే తొలిగా

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, ఆశ్వి అప్డేట్స్ :**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్లకు అందిస్తున్న రూ.కోటి బీమా పథకం దేశంలోనే తొలిసారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రకటించారు. ఉద్యోగి దురదృష్టవశాత్తు మరణించినా అతడి కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకుండా భద్రత కల్పించాలనే మానవీయ ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా బ్యాంకుల సహకారంతో పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా, హెల్త్ కార్డుల గురించి సభ్యులు గురువారం అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి వివరణాత్మకంగా జవాబిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 16 బ్యాంకులతో ఒప్పందం చేసుకుని రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి బీమా కవరేజీ కల్పిస్తోందన్నారు. ఈ మేరకు 2024 జూన్ 26న ఆర్థిక శాఖ 77వ జీవో జారీ చేసిందని, పథకం అమలు విధానం, అర్హతలు, బీమా కవరేజీ, నిబంధనలు, షరతులను అందులో పేర్కొందని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.కోటి బీమాతోపాటు ఇతర ప్రయోజనాలు కలిపి రూ.1.20 కోట్ల వరకు ప్రయోజనం అందేలా చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. విమాన ప్రయాణ సమయంలో ప్రమాదం జరిగితే రూ.2 కోట్ల వరకు బీమా ప్రయోజనం కల్పిస్తున్నట్లు వెల్లడించించారు. సహజ మరణానికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం కల్పించే వెసులుబాటు కూడా ఉన్నట్లు చెప్పారు.

**12.91 లక్షల మందికి కవరేజీ**

రాష్ట్రంలో మొత్తం 12,91,056 మంది ఈ పథకం పరిధిలో ఉన్నట్లు, వీరిలో 5,18,293 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. ఇంకా 5,00,158 మంది తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్, మల్టీపర్పస్ వర్కర్లు, కాంట్రాక్ట్, డైలీవేజ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎంటీఎస్, సెర్ప్ తదితర సిబ్బంది ఉన్నారు. 2,72,600 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఉన్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి వివరించారు.

**సింగరేణితో శ్రీకారం**

ఉద్యోగుల కోసం రూ.కోటి బీమా పథకానికి తొలుత సింగరేణి కాలరీస్‌లో శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ పరిధిలోని డిస్కమ్‌లు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పథకాన్ని విస్తరించినట్లు చెప్పారు. చివరగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ వర్తించేలా విస్తరించినట్లు పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులకు 2024 ఫిబ్రవరిలో, ఇంధన శాఖ ఉద్యోగులకు 2025లో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ 2026 జూన్ 25 నుంచి పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

**ప్రభుత్వానికి రూపాయి భారం లేదు**

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్న బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరిపి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగుల జీతాలు తమ బ్యాంకుల ద్వారా జమ అవుతున్నందున, బ్యాంకులకు వ్యాపారపరంగా ప్రయోజనం కలుగుతున్న నేపథ్యంలో బీమా పథకానికి బ్యాంకులే సహకరించేలా ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ప్రీమియం భారం లేకుండా పథకం అమలవుతోందన్నారు.

**ఇప్పటికే క్లెయిమ్‌ల పరిష్కారం**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఇప్పటివరకు 33 క్లెయిమ్‌లు వచ్చాయని, వాటిలో 24 క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు తెలిపారు. విద్యుత్ శాఖకు చెందిన ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కో పరిధిలో 15 క్లెయిమ్‌లు రాగా అన్నింటినీ పరిష్కరించినట్లు చెప్పారు. ఈ విభాగంలో రూ.15 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా సింగరేణి కాలరీస్‌లో 50 క్లెయిమ్‌లు రాగా అన్నింటిని పరిష్కరించినట్లు తెలిపారు.

**కేంద్రం, ఇతర రాష్ట్రాలు అధ్యయనం**

రాష్ట్రంలో ప్రారంభించిన ప్రమాద బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసిందని ఉప ముఖ్యమంత్రి సభకు చెప్పారు. ఇతర రాష్ట్రాలు సైతం తెలంగాణలో అమలు చేస్తున్న ఈ బీమా విధానాన్ని పరిశీలించేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. తమిళనాడు కూడా ఈ తరహా పథకాన్ని అమలు చేసినట్లు ఆయన వెల్లడించారు.

**ఉద్యోగులకు హెల్త్‌కార్డు**

బీమా పథకంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్‌కార్డు పథకాన్ని కూడా తీసుకొచ్చినట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. దశాబ్దాలుగా ఉద్యోగ సంఘాలు కోరుతున్న క్యాష్‌లెస్ వైద్య సేవల కలను ప్రభుత్వం సాకారం చేసిందని చెప్పారు. ఉద్యోగులు, వారి సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత ముఖ్య కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేసి చర్చల అనంతరం హెల్త్‌కార్డుల విధానాన్ని ఖరారు చేసినట్లు వివరించారు. క్యాష్‌లెస్ వైద్యం, సీజీహెచవస్ ప్యాకేజీ వంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. హెల్త్‌కార్డు పథకం కోసం ఇప్పటికే సుమారు రూ.240 కోట్ల నిధులు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి బీమా, ఆరోగ్య భద్రతకు హెల్త్‌కార్డు, రెండు పథకాలూ ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక, వైద్య భరోసా కల్పించేలా రూపొందించామని ఉప ముఖ్యమంత్రి భట్టి శాసనసభకు చెప్పారు.

# 17న పబ్లిక్ గార్డెన్‌లో ప్రజా పాలన దినోత్సవం

- **ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష**
- **వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పక్కా ఏర్పాట్లు చేయాలి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 , ఆశ్వి అప్డేట్స్:**



పబ్లిక్ గార్డెన్‌లో ఈనెల 17న నిర్వహించే తెలంగాణ ప్రజా పాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై సచివాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆరోజు ఉదయం అసెంబ్లీ ఎదురుగా గల అమరవీరుల స్థూపం వద్ద ముఖ్యమంత్రి నివాళులర్పించి అనంతరం పబ్లిక్ గార్డెన్‌కు వస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద, పబ్లిక్ గార్డెన్‌లో సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. నగరంలోని పలు ప్రధాన భవనాలకు, చారిత్రక కట్టడాలకు విద్యుద్దీపాల అలంకరణ చేపట్టాలన్నారు. ఈనెల 15న డ్రెస్ రిహార్సల్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రజాపాలన దినోత్సవానికి వేయిమంది స్వయం సహాయక మహిళలతోపాటు రెండు వేల మంది హాజరవుతారన్నారు. సమావేశానికి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయల్, హైదాబాద్ సి.పి.సజ్జనార్, ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితర సీనియర్ అధికారులు హాజయ్యారు.

వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పక్కా ఏర్పాట్లు చేయాలి

వానాకాలం (202627 ఖరీఫ్) సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. సుమారు 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు సీఎస్ తెలిపారు. సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. గత సీజన్‌లో సుమారు 70 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి 154.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సీఎస్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,283 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), ఇతర కొనుగోలు ఏజెన్సీల సమన్వయంతో కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ నుంచి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం ప్రారంభమవుతుందని, నవంబర్‌లో పెద్దఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం రవాణా, హమాలీల ఏర్పాటు, గోదాములు, నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ ఆదేశించారు.

## శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి సమయ సూచిక విరాళం

- **సేవా ఫౌండేషన్ చైర్మన్ తాండా బాలకృష్ణ గౌడ్ ఉదారత**

**గజ్వేల్ | సెప్టెంబర్ 10 | ఆశ్వి అప్డేట్స్**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి పాములపర్తికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు, సేవా ఫౌండేషన్ చైర్మన్ తాండా బాలకృష్ణ గౌడ్ సమయ సూచికను విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో గడియారాన్ని ఆలయానికి సమర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలో భక్తిభావం, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందేలా నూతన ఆలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలు గ్రామంలో శాంతి, సమైక్యతను పెంపొందించడంతో పాటు ప్రజల్లో సత్సంకల్పాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. భగవంతుని సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. సమాజ సేవతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కూడా తమ సేవా ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బాలకృష్ణ గౌడ్ స్పష్టం చేశారు. ఆలయ నిర్మాణానికి కృషి చేసిన గ్రామ పెద్దలు, యువత, ఆలయ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పొన్నోజి కృష్ణ, శేఖర్ బాలచారి, బోయిని స్వామి, చెన్ రాజ్ కృష్ణ, పాండు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆయుధాగారంలో సీపీ ఆకస్మిక తనిఖీ

- **ఆయుధాల భద్రతపై ప్రత్యేక దృష్టి**
- **రికార్డులు, స్టాక్ రిజిస్టర్ల పరిశీలన – సిబ్బందికి కీలక ఆదేశాలు**

**కరీంనగర్, సెప్టెంబర్ 10, ఆశ్వి అప్డేట్స్:**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లోని ఆయుధాగారాన్ని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనరేట్ కేంద్రంలోని 9వ తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్‌కు చెందిన ఆయుధాగారాన్ని కూడా ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా ఆయుధ భద్రతా గదిలో తుపాకులు, మందుగుండు సామగ్రి నిల్వ, భద్రతా ఏర్పాట్లను సీపీ పరిశీలించారు. ఆయుధాగారంలో ఉన్న తుపాకుల సంఖ్యను అధికారిక రికార్డుల్లో నమోదైన వివరాలతో సరిపోల్చి చూశారు. అలాగే సిబ్బందికి ఆయుధాలు కేటాయించడం, తిరిగి జమ చేయడం వంటి వివరాలను నమోదు చేసే లాగ్‌బుక్‌లు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయుధాలు ఎల్లప్పుడూ సక్రమంగా పనిచేసేలా నిరంతరం సర్వీసింగ్ చేయాలని, భద్రతా నిబంధనలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించవద్దని అడ్మిన్ ఆర్ఐ శ్రీధర్ రెడ్డి, ఆయుధాగార అధికారులకు సీపీ సూచించారు. ఆయుధాల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ శ్రీధర్ రెడ్డి, ఆయుధాగార సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





## మహంకాళి–సికింద్రాబాద్ జిల్లా పబ్లిసిటీ సెల్ కన్వీనర్‌గా మనోజ్ ఉపాధ్యాయ్

- **పార్టీ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పిస్తా: మనోజ్ ఉపాధ్యాయ్**
- **జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్‌కు కృతజ్ఞతలు**

**సికింద్రాబాద్ | సెప్టెంబర్ 10 | ఆశ్వి అప్డేట్స్**

భారతీయ జనతా పార్టీ మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా పబ్లిసిటీ సెల్ కన్వీనర్‌గా రాంగోపాల్‌పేట్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు మనోజ్ ఉపాధ్యాయ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గుండుగోని భరత్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మనోజ్ ఉపాధ్యాయ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా కార్యవర్గంలో బాధ్యతలు అప్పగించిన భరత్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. బీజేపీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, పార్టీ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పబ్లిసిటీ సెల్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పార్టీకి మరింత ప్రచారం కల్పిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు నెమలి ఆనంద్, సారంగపాణి, రమేష్ రామ్, జిల్లా కార్యాలయ కార్యదర్శి కిరణ్ కుమార్, రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు భవర్లాల్ సందీప్ వర్మ, ప్రధాన కార్యదర్శి అనిష్ వర్మ తదితరులు పాల్గొని మనోజ్ ఉపాధ్యాయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.





# ధోలేరా స్మార్ట్ సిటీ.. లోథాల్ చారిత్రక వైభవం

- **అభివృద్ధి–వారసత్వ పరిరక్షణ సమన్వయానికి ప్రత్యక్ష సాక్ష్యం**
- **గుజరాత్‌లో పీఐబీ ఏర్పాటు చేసిన పర్యటనలో తెలంగాణ మీడియా ప్రతినిధులు**

**ఆశ్వి అప్డేట్స్ | హైదరాబాద్ | సెప్టెంబర్ 9:**

ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో గుజరాత్‌లో పర్యటిస్తున్న తెలంగాణ మీడియా ప్రతినిధుల బృందం బుధవారం ధోలేరా గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ, చారిత్రక లోథాల్ పురావస్తు ప్రదేశాలను సందర్శించింది. ధోలేరాలో ప్రతినిధుల బృందానికి సమగ్ర మాస్టర్ ప్లానింగ్, ప్లగ్‌అండ్ ప్లే పారిశ్రామిక వ్యవస్థ, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై అధికారులు వివరించారు. ధోలేరా ప్రాంతంలో అభివృద్ధి చేస్తున్న స్మార్ట్ యుటిలిటీస్, లాజిస్టిక్స్ కనెక్టివిటీ, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ధోలేరా ఇండస్ట్రియల్ సిటీ డెవలప్‌మెంట్ లిమిటెడ్ (DICDL) జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రుషిన్ భట్, మార్కెటింగ్ మేనేజర్ అదితి గోయక్ మీడియా ప్రతినిధులకు వివరించారు. అనంతరం మీడియా బృందం సుమారు 4,500 ఏళ్ల నాటి హరప్పా నాగరికతకు చెందిన ప్రముఖ స్థావరమైన లోథాల్ పురావస్తు ప్రాంతాన్ని సందర్శించింది. అక్కడ వెలికితీసిన పురాతన డాక్‌యార్డ్, గోదాముల సముదాయాలు, పట్టణ మురుగునీటి పారుదల వ్యవస్థలను పరిశీలించింది. హరప్పా నాగరికతలోని అధునాతన ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, సముద్ర వాణిజ్య పద్ధతులపై జర్నలిస్టులు అవగాహన పొందారు.

**రూ.4,500 కోట్లతో నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్**

లోథాల్‌లో కేంద్ర నౌకాశ్రయాలు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సాగర్‌మాల కార్యక్రమం కింద అభివృద్ధి చేస్తున్న నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్ (NMHC) నిర్మాణ పనులను కూడా మీడియా ప్రతినిధులు పరిశీలించారు.

సుమారు 400 ఎకరాల్లో రూ.4,500 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు వివరించారు. భారతదేశ 4,500 ఏళ్ల సముద్ర వారసత్వాన్ని ప్రతిబింబించే మారిటైమ్ గ్యాలరీలు, పురాతన లోథాల్ నమూనా, లైట్‌హౌస్ మ్యూజియం, 5డీ డోమ్ థియేటర్, ఆక్వాటిక్ గ్యాలరీ తదితర ఆకర్షణలు ఇందులో ఉంటాయని తెలిపారు.

అదేవిధంగా తీరప్రాంత రాష్ట్రాల పావిలియన్లు, థీమ్ పార్కులు, పర్యావరణహిత రవాణా సౌకర్యాలు, సందర్శకుల వసతి వంటి సదుపాయాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ధోలేరా ఆధునిక పారిశ్రామిక, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తుండగా.. లోథాల్ భారతదేశ ప్రాచీన నాగరికత, సముద్ర వారసత్వానికి ప్రతిబింబంగా నిలుస్తోందని మీడియా ప్రతినిధుల పర్యటనలో స్పష్టమైంది. అభివృద్ధితో పాటు చారిత్రక వారసత్వ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను ఈ పర్యటన ద్వారా జర్నలిస్టులు ప్రత్యక్షంగా పరిశీలించారు. 'వికాస్ భీ, విరాసత్ భీ' అనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు ధోలేరా–లోథాల్ అభివృద్ధి, వారసత్వ పరిరక్షణ సమన్వయం ఒక ఉదాహరణగా నిలుస్తోందని పీఐబీ అధికారులు పేర్కొన్నారు.

# 17న ఘనంగా ప్రజా పాలనా దినోత్సవం





- **పబ్లిక్ గార్డెన్‌లో వేడుకలకు విస్తృత ఏర్పాట్లు**
- **అమరవీరుల స్థూపం వద్ద సీఎం నివాళులు.. 3 వేల మందికి పైగా హాజరు**

**ఆశ్వి అప్డేట్స్ | హైదరాబాద్, సెప్టెంబర్ 10:**

తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవాన్ని ఈనెల 17న హైదరాబాద్ నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. కార్యక్రమ నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ప్రజా పాలనా దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శాఖల వారీగా సమన్వయం చేసుకుని ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా భద్రత, ట్రాఫిక్, పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు, వేదిక, సాంస్కృతిక కార్యక్రమాలు, అతిథుల రాకపోకలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

**అమరవీరుల స్థూపం వద్ద సీఎం నివాళులు**

ఈనెల 17న ఉదయం అసెంబ్లీ ఎదురుగా ఉన్న అమరవీరుల స్థూపం వద్ద ముఖ్యమంత్రి నివాళులు అర్పించిన అనంతరం పబ్లిక్ గార్డెన్‌లో జరిగే ప్రజా పాలనా దినోత్సవ కార్యక్రమానికి హాజరవుతారని సీఎస్ తెలిపారు.

అమరవీరుల స్థూపం వద్ద, పబ్లిక్ గార్డెన్‌లో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని సదుపాయాలు సిద్ధం చేయాలని సూచించారు.

**ప్రధాన భవనాలకు విద్యుత్ దీపాల అలంకరణ**

ప్రజా పాలనా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలోని పలు ప్రధాన ప్రభుత్వ భవనాలు, చారిత్రక కట్టడాలకు విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టాలని సీఎస్ సూచించారు. నగరంలో పండుగ వాతావరణం కనిపించేలా అలంకరణలు ఉండాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఈనెల 15న పూర్తిస్థాయి డ్రెస్ రిహార్సల్ నిర్వహించి అన్ని ఏర్పాట్లను ముందుగానే పరిశీలించాలని సూచించారు. రిహార్సల్ సందర్భంగా కార్యక్రమ నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**మూడు వేల మందికి పైగా హాజరు**

ప్రజా పాలనా దినోత్సవ కార్యక్రమానికి సుమారు వెయ్యి మంది స్వయం సహాయక సంఘాల మహిళలు, మరో రెండు వేల మంది హాజరయ్యే అవకాశం ఉందని సీఎస్ తెలిపారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొననున్న నేపథ్యంలో పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తాగునీరు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు.

**ఉన్నతాధికారులతో సమీక్ష**

సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయల్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ప్రజా పాలనా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులకు స్పష్టం చేశారు.





# మధుయాష్కి గౌడ్‌కు సీఎల్పీలో ఘన సన్మానం

- **ఏఐపీసీ చైర్‌పర్సన్‌గా నియామకంతో జాతీయ స్థాయిలో కీలక బాధ్యత**
- **సీఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సహా మంత్రులు, ఎమ్మెల్యేల అభినందనలు**

**ఆశ్వి అప్డేట్స్ | హైదరాబాద్:**

ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) చైర్‌పర్సన్‌గా నియమితులైన మాజీ పార్లమెంట్ సభ్యుడు మధుయాష్కి గౌడ్‌కు తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఘనంగా అభినందనలు తెలిపింది. అసెంబ్లీలో జరిగిన సీఎల్పీ భేటీ అనంతరం మధుయాష్కి గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవగా, సీఎం ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు మంత్రులు, ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మధుయాష్కి గౌడ్‌ను అభినందించారు. జాతీయ స్థాయిలో కీలకమైన బాధ్యత తను చేపట్టిన నేపథ్యంలో ఆయనకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

**జాతీయ స్థాయిలో తెలంగాణ నేతకు కీలక బాధ్యత**

ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ అనేది దేశవ్యాప్తంగా వైద్యులు, ఇంజినీర్లు, న్యాయవాదులు, విద్యావేత్తలు, ఐటీ నిపుణులు, పారిశ్రామికవేత్తలు, వివిధ వృత్తి రంగాలకు చెందిన నిపుణులను కాంగ్రెస్ పార్టీతో అనుసంధానించే వేదికగా పనిచేస్తుంది. ఈ సంస్థకు చైర్‌పర్సన్‌గా మధుయాష్కి గౌడ్ నియామకం కావడం తెలంగాణ కాంగ్రెస్‌కు రాజకీయంగా ప్రాధాన్యత కలిగించే అంశంగా మారింది. ప్రొఫెషనల్స్‌లో రాజకీయ అవగాహన పెంచడం, ప్రజా విధానాలపై నిపుణుల అభిప్రాయాలను పార్టీ చర్చల్లోకి తీసుకురావడం, యువతతో పాటు వివిధ వృత్తి రంగాల్లోని ప్రతిభావంతులను పార్టీ కార్యకలాపాలకు అనుసంధానం చేయడం వంటి అంశాల్లో ఏఐపీసీకి ప్రాధాన్యత ఉంది. ఈ నేపథ్యంలో మధుయాష్కి గౌడ్‌కు అప్పగించిన బాధ్యత జాతీయ స్థాయిలో విస్తృతమైనదిగా కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

**తెలంగాణ అనుభవం.. జాతీయ బాధ్యతకు ఉపయోగకరం**

మాజీ ఎంపీగా మధుయాష్కి గౌడ్‌కు జాతీయ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. తెలంగాణ రాజకీయాలతో పాటు ఢిల్లీ రాజకీయ పరిణామాలపై కూడా ఆయనకు అవగాహన ఉండటం కొత్త బాధ్యతలో ఉపయోగపడుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రత్యేకంగా ప్రొఫెషనల్స్, యువత, పట్టణ మధ్యతరగతి వర్గాలను కాంగ్రెస్ వైపు ఆకర్షించడంలో ఏఐపీసీకి మరింత చురుకైన పాత్ర ఉండే అవకాశం ఉంది. మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో సోషల్ మీడియా, టెక్నాలజీ, ఆర్థిక విధానాలు, ఉపాధి, విద్య, స్టార్టప్‌లు, పట్టణాభివృద్ధి వంటి అంశాలపై నిపుణుల భాగస్వామ్యం పెంచడం కూడా సంస్థ ముందున్న కీలక అంశాలుగా కనిపిస్తున్నాయి.

**నాయకత్వం నుంచి పూర్తి మద్దతు**

మధుయాష్కి గౌడ్‌ను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సన్మానించడం, డిప్యూటీ సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభినందించడం ద్వారా ఆయన కొత్త బాధ్యతకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం నుంచి లభిస్తున్న ప్రాధాన్యత స్పష్టమవుతోంది. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్, సీతక్క, పొన్నం ప్రభాకర్ గౌడ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు తదితరులు మధుయాష్కి గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



**ముందున్న సవాళ్లు.. అవకాశాలు**

ఏఐపీసీ చైర్‌పర్సన్‌గా మధుయాష్కి గౌడ్ ముందున్న ప్రధాన సవాలు దేశవ్యాప్తంగా వివిధ వృత్తి రంగాల్లోని నిపుణులను కాంగ్రెస్ ఆలోచనా విధానంతో అనుసంధానం చేయడం. అదే సమయంలో ప్రస్తుత తరం యువ నిపుణుల ఆకాంక్షలు, ఉపాధి అవకాశాలు, ఆర్థికాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలను రాజకీయ చర్చల్లోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో మధుయాష్కి గౌడ్‌కు లభించిన కొత్త బాధ్యత వ్యక్తిగత పదవి మాత్రమే కాకుండా.. తెలంగాణ నుంచి జాతీయ కాంగ్రెస్ రాజకీయాల్లో మరో కీలక బాధ్యత చేపట్టిన సందర్భంగానూ పార్టీ వర్గాలు చూస్తున్నాయి. ఆయన నాయకత్వంలో ఏఐపీసీ కార్యకలాపాలు ఏ మేరకు విస్తరిస్తాయన్నది రానున్న రోజుల్లో ఆసక్తికరంగా మారనుంది.

# భారీగా పెరిగిన బంగారం ధరలు

**ఆశ్వి అప్డేట్స్ | సెప్టెంబర్ 10**

హైదరాబాద్ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు భారీగా పెరిగాయి. గురువారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,200 పెరిగి రూ.1,55,510కు చేరింది.

అదేవిధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,100 పెరిగి రూ.1,42,550కు చేరుకుంది. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులపై మరింత భారం పడుతోంది. మరోవైపు కిలో వెండి ధర రూ.2,55,000 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో పరిణామాలు, వడ్డీ రేట్లపై అంచనాలు, భౌగోళిక ఉద్రిక్తతలు వంటి అంశాలు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయి.



తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రధాన నగరాల్లో ఆభరణాల వ్యాపారులు, మార్కెట్ పరిస్థితులను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండే అవకాశం ఉంది. ఆభరణాల కొనుగోలులో మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీ తదితరాలు అదనంగా వర్తిస్తాయి.

# సీఎంఆర్‌ఎఫ్‌కు ఎంత ఖర్చయినా భరిస్తాం: కేఎల్‌ఆర్

- **1000 రోజుల పాలనలో రూ.2,467 కోట్లకు పైగా ఖర్చు చేశాం**
- **4 లక్షలకుపైగా రోగుల కుటుంబాలకు ఆర్థిక చేయూత: కేఎల్‌ఆర్**

**ఆశ్వి అప్డేట్స్ | హైదరాబాద్:**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా పెద్దఎత్తున ఆర్థిక సహాయం అందిస్తోందని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ నేత కేఎల్‌ఆర్ పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడాదికి సుమారు రూ.450 కోట్ల మేర సీఎంఆర్‌ఎఫ్ కోసం ఖర్చు చేస్తే, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.843 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు.

**1000 రోజుల్లో రూ.2,467 కోట్లకు పైగా**

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.2,467 కోట్లకు పైగా ఖర్చు చేసిందని కేఎల్‌ఆర్ వెల్లడించారు. దీని ద్వారా 4 లక్షల మందికి పైగా రోగుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీతో పాటు సీఎంఆర్‌ఎఫ్‌ను కలిపి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.4,500 కోట్లకు పైగా చెల్లింపులు చేసిందని పేర్కొన్నారు. అత్యవసర వైద్య చికిత్సలు, ఖరీదైన వైద్యం అవసరమైన పేద కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు.

**ఎల్ఓసీ కింద రూ.620 కోట్లు**

Letter of Credit (LOC) కింద సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.620 కోట్ల మేర చెల్లింపులు చేసినట్లు కేఎల్‌ఆర్ తెలిపారు. ఇందులో NIMSలో 29,694 కేసులకు,



MNJ క్యాన్సర్ ఆస్పత్రిలో 340 కేసులకు, ప్రభుత్వ ENT ఆస్పత్రిలో 210 కేసులకు LOC ద్వారా సహాయం అందించినట్లు వివరించారు.

**ఆన్‌లైన్ విధానంతో పారదర్శకత**

సీఎంఆర్‌ఎఫ్ నిర్వహణలో పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కేఎల్‌ఆర్ పేర్కొన్నారు. చెక్కుల్లో అవకతవకలకు అవకాశం లేకుండా ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొచ్చామని, మంజూరైన మొత్తాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అదేవిధంగా సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న పేద విద్యార్థులకు అత్యవసర వైద్య అవసరాల కోసం సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.60 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు**

గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల విషయంలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ కేఎల్‌ఆర్ విమర్శలు చేశారు. అయితే గత పాలనలో అవినీతి జరిగిందనే ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను ఆయన ఈ ప్రకటనలో వెల్లడించలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో పారదర్శకత, జవాబుదారీతనానికి పెద్దపీట వేస్తోందని కేఎల్‌ఆర్ పేర్కొన్నారు. పేదల ఆరోగ్య అవసరాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అర్హులైన వారికి అవసరమైన సహాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.



# చిన్నారి అద్విక్ చికిత్సకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలి

- **పెండింగ్ బిల్లులు వారం రోజుల్లో చెల్లిస్తామని అధికారుల హామీ**
- **అద్విక్‌కు అవసరమైన తదుపరి చికిత్స ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుంది**

**ఆశ్వి అప్డేట్స్ | ఎల్బీనగర్:**

కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి అద్విక్‌కు అవసరమైన వైద్య చికిత్సకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని బీజేపీ నేత బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

బీఎన్ రెడ్డి నగర్ డివిజన్‌లో మే 11న కుక్కల దాడిలో అద్విక్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఎల్బీనగర్‌లోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి వైద్య ఖర్చులు సుమారు రూ.16 లక్షలకు చేరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం గతంలో చికిత్స ఖర్చును భరిస్తామని హామీ ఇచ్చినా, పెండింగ్ నిధులు విడుదల కాకపోవడంతో కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంటోందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ బీజేపీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పాల్గొని చిన్నారి చికిత్సకు ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరారు. నిరసనపై స్పందించిన జోనల్ కమిషనర్ సంబంధిత డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. దీంతో ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడిన డిప్యూటీ కమిషనర్ వారం రోజుల్లో పెండింగ్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, ఇకపై అద్విక్‌కు అవసరమయ్యే వైద్య చికిత్సకు ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. తమకు అండగా నిలిచిన బీజేపీ నాయకులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారి అద్విక్ త్వరగా కోలుకోవాలని బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, మోర్చా నాయకులు, కార్యకర్తలు, అద్విక్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రముఖ రియల్టర్ రాంరెడ్డి ఆత్మహత్య.. కలకలం!

- కందుకూరు నేదునూరు ఫాంహౌస్‌లో ఉరివేసుకుని బలవన్మరణం
- పటాన్‌చెరులో 280 ఎకరాల్లో భారీ వెంచర్ పనుల్లో ఉన్నట్లు సమాచారం



**రంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 10, ఆశ్వి అప్డేట్స్:**

ప్రముఖ రియల్టర్, హోమ్ ల్యాండ్ అధినేత రాంరెడ్డి ఆత్మహత్య చేసుకోవడం రంగారెడ్డి జిల్లాలో కలకలం రేపింది. కందుకూరు మండలం నేదునూరులోని తన ఫాంహౌస్‌లో ఆయన ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఫాంహౌస్‌కు చేరుకుని వివరాలు సేకరించారు. రియల్ ఎస్టేట్ రంగంలో కీలకంగా ఉన్న రాంరెడ్డి.. పటాన్‌చెరు పరిధిలో సుమారు 280 ఎకరాల్లో భారీ వెంచర్ ఏర్పాటు చేసే పనుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కొంతకాలంగా ఆయనపై రాజకీయ నాయకుల నుంచి ఒత్తిళ్లు ఉన్నాయనే ప్రచారం జరుగుతున్నట్లు సమాచారం. అయితే ఈ ప్రచారానికి ఇప్పటివరకు పోలీసుల నుంచి అధికారిక ధ్రువీకరణ లేదు. రాంరెడ్డి ఆత్మహత్యకు రాజకీయ ఒత్తిళ్లు కారణమా? లేక వ్యక్తిగత, వ్యాపారపరమైన ఇతర కారణాలు ఉన్నాయా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫాంహౌస్‌లో లభించిన ఆధారాలు, ఫోన్ కాల్ డేటా, ఇతర వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. పోస్టుమార్టం నివేదిక, దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా అసలు కారణాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఆత్మహత్యకు రాజకీయ ఒత్తిళ్లే కారణమని ఇప్పటివరకు నిర్ధారణ కాలేదు. పోలీసులు దర్యాప్తు పూర్తిచేసిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.




## చట్టాలను గౌరవిస్తూ గౌరవప్రదంగా జీవించాలి

- బలవంతపు వసూళ్లు, ప్రజల వేధింపులకు పాల్పడితే చర్యలు తప్పవు
- ట్రాన్స్‌జెండర్లతో అవగాహన సమావేశంలో నల్గొండ డీఎస్పీ కే. శివరాం రెడ్డి

**ఆశ్వి అప్డేట్స్ | నల్గొండ | సెప్టెంబర్ 10:**

ట్రాన్స్‌జెండర్లు చట్టాలను గౌరవిస్తూ, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా గౌరవప్రదమైన జీవనం సాగించాలని నల్గొండ డీఎస్పీ కే. శివరాం రెడ్డి సూచించారు. నల్గొండ పట్టణ పరిధిలోని ట్రాన్స్‌జెండర్లతో డీఎస్పీ ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. వ్యాపార సంస్థలు, దుకాణాలు, ఇళ్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, పండుగలు, శుభకార్యాల వంటి సందర్భాల్లో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ బలవంతంగా డబ్బులు డిమాండ్ చేయడం లేదా వసూలు చేయడం చేయరాదని స్పష్టం చేశారు. ఎవరైనా స్వచ్ఛందంగా అందించే సహాయాన్ని మాత్రమే స్వీకరించాలని సూచించారు. డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడం, బెదిరించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, ప్రజలను వేధించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అదే సమయంలో ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న వేధింపులు, బెదిరింపులు లేదా ఇతర చట్టపరమైన సమస్యలు ఉంటే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని డీఎస్పీ భరోసా ఇచ్చారు. పోలీస్ శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లు కూడా సమాజంలో ఒక భాగమేనని, వారి పట్ల ప్రతి ఒక్కరూ గౌరవభావంతో వ్యవహరించాలని సూచించారు. అదే విధంగా ప్రజల హక్కులు, స్వేచ్ఛకు భంగం కలగకుండా వారు కూడా చట్టబద్ధంగా వ్యవహరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఆదిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు సైదాబాబు, షరీఫ్‌తో పాటు పలువురు ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

## ఐదు రోజుల బ్యాంకింగ్ కోసం నేడు భారీ నిరసన

- పీఎల్ఐలో అసమానతలను తొలగించి న్యాయమైన చెల్లింపులు చేయాలని డిమాండ్
- రాష్ట్రవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారుల ఆందోళన

**ఆశ్వి అప్డేట్స్ | హైదరాబాద్ | సెప్టెంబర్ 11:**

బ్యాంకింగ్ రంగంలో ఐదు రోజుల పనిదినాల విధానాన్ని తక్షణమే అమలు చేయాలని, పనితీరు ఆధారిత ప్రోత్సాహకం (Performance Linked Incentive-PLI)లో ఉన్న అసమానతలను తొలగించి అన్ని కేడర్లకు న్యాయమైన చెల్లింపులు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలో బ్యాంకు ఉద్యోగులు, అధికారులు భారీ నిరసనకు సిద్ధమయ్యారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (UFBU) జాతీయ అపెక్స్ నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు UFBU తెలంగాణ రాష్ట్ర యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ కోటిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) లోకల్ హెడ్ ఆఫీస్ వద్ద ఈ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు.

**ఐదు రోజుల పనిదినాల అమలుకు డిమాండ్**

బ్యాంకింగ్ రంగంలో ఐదు రోజుల పనిదినాల విధానాన్ని అన్ని బ్యాంకు ఉద్యోగులకు తక్షణమే అమలు చేయాలని యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. వారానికి ఐదు రోజుల పనిదినాలతో ఉద్యోగుల పని-వ్యక్తిగత జీవన సమతుల్యత మెరుగుపడటంతో పాటు, సాంకేతికత ఆధారిత ఆధునిక బ్యాంకింగ్ వ్యవస్థలో సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించే అవకాశం ఉంటుందని యూనియన్లు పేర్కొంటున్నాయి.

**పీఎల్ఐలో అసమానతలు తొలగించాలి**

బ్యాంకు ఉద్యోగులు, అధికారులకు పనితీరు ఆధారంగా అందించే *పర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ (PLI)*లో ప్రస్తుతం ఉన్న వ్యత్యాసాలను తొలగించాలని మరో ప్రధాన డిమాండ్‌గా యూనియన్లు ముందుకు తెచ్చాయి. వివిధ కేడర్ల మధ్య పీఎల్ఐ చెల్లింపుల్లో ఉన్న అసమానతలను తొలగించి, ఉద్యోగులందరికీ ఏకరీతి, న్యాయమైన చెల్లింపు విధానం అమలు చేయాలని కోరుతున్నారు. ఉద్యోగుల కృషికి తగిన గుర్తింపు, ప్రోత్సాహం లభించేలా విధానం ఉండాలని యూనియన్లు స్పష్టం చేస్తున్నాయి.

**జాతీయ పిలుపుతో రాష్ట్రవ్యాప్త ఆందోళన**

దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన సమస్యలపై UFBU అపెక్స్ నాయకత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా తెలంగాణలో ఈ నిరసన చేపడుతున్నట్లు రాష్ట్ర యూనిట్ వెల్లడించింది. బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు, ఉద్యోగుల హక్కులకు అనుగుణంగా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి UFBU తెలంగాణ రాష్ట్ర యూనిట్ కన్వీనర్ కే. అంజనేయ ప్రసాద్ నాయకత్వం వహించనున్నారు. రాష్ట్రంలోని వివిధ బ్యాంకులకు చెందిన ఉద్యోగులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉంది.

## ఆత్మహత్యలు వద్దు.. మీ కోసం మీ కుటుంబం ఎదురుచూస్తోంది

- ఆన్‌లైన్ బెట్టింగ్ ఉచ్చులో పడి జీవితాలను బలి చేసుకోవద్దు
- సమస్య ఎంత పెద్దదైనా పరిష్కారం ఉంటుంది.. కుటుంబంతో పంచుకోండి
- తెలంగాణలోని 93 వేల మంది పోలీసు సిబ్బందికి డీజీపీ సీవీ ఆనంద్ పిలుపు



**ఆశ్వి అప్డేట్స్ | హైదరాబాద్, సెప్టెంబర్ 10:**

ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలిచే పోలీసు సిబ్బంది తమ జీవితాల్లో ఎదురయ్యే సమస్యలకు ఆత్మహత్యను పరిష్కారంగా భావించవద్దని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా పోలీసు సిబ్బందికి ప్రత్యేక సందేశాన్ని విడుదల చేశారు.
గత నాలుగు నెలల్లో తెలంగాణ పోలీసు శాఖకు చెందిన ఇద్దరు సిబ్బంది ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు తనను తీవ్రంగా కలచివేశాయని డీజీపీ తెలిపారు. యువ, మధ్య వయస్కులైన కానిస్టేబుళ్లు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం మరింత బాధాకరమన్నారు. ఈ ఘటనలపై జరిగిన విచారణలో ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా అప్పులపాలవడమే ప్రధాన కారణంగా గుర్తించినట్లు వెల్లడించారు.
కొందరు అప్పులు తీర్చేందుకు భూములు విక్రయించగా, మరికొందరు స్నేహితులు, సహోద్యోగుల వద్ద అప్పులు చేశారని తెలిపారు. ఇంకొందరు అధిక వడ్డీలకు డబ్బులు తీసుకుని అప్పుల ఒత్తిడికి గురయ్యారని వివరించారు.

**అప్పులు దాచొద్దు.. ఆవేదన దాచొద్దు**

ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు వాటిని కుటుంబ సభ్యుల నుంచి దాచిపెట్టకుండా జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు, సన్నిహితులతో పంచుకోవాలని డీజీపీ సూచించారు. సమస్యను చెప్పుకోవడం బలహీనత కాదని, అవసరమైన సమయంలో సహాయం కోరడమే నిజమైన ధైర్యమని అన్నారు. అప్పుల ఒత్తిడి పెరిగినప్పుడు ఒంటరిగా బాధపడకుండా ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై శాఖ ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని తెలిపారు.

**బెట్టింగ్‌లో డబ్బు పోవచ్చు.. జీవితం పోకూడదు**

ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ మొదట సరదాగా ప్రారంభమైనా తర్వాత వ్యసనంగా మారి ఆర్థికంగా, మానసికంగా తీవ్ర నష్టాలకు దారితీసే ప్రమాదం ఉందని డీజీపీ హెచ్చరించారు. నష్టపోయిన డబ్బును తిరిగి సంపాదించాలనే ప్రయత్నంలో మరింత డబ్బు పెట్టి అప్పుల ఊబిలో చిక్కుకోవద్దన్నారు. డబ్బు పోతే తిరిగి సంపాదించుకోవచ్చు.. అప్పులు ఉంటే క్రమంగా తీర్చుకోవచ్చు.. సమస్యలు వస్తే పరిష్కరించుకోవచ్చు.. కానీ పోయిన ప్రాణాన్ని మాత్రం తిరిగి తీసుకురాలేం అని గుర్తుచేశారు.

**మీ కోసం ఒక కుటుంబం ఎదురుచూస్తోంది**

పోలీసు సిబ్బంది తమ కుటుంబాలను గుర్తుచేసుకోవాలని డీజీపీ కోరారు. డ్యూటీ ముగించుకుని ఇంటికి ఎప్పుడు వస్తారా అని ఎదురుచూసే భార్యాభర్తలు, తల్లిదండ్రులు, పిల్లలు ఉంటారని అన్నారు. "మీరు లేకపోతే మీ కుటుంబాన్ని ఎవరు చూసుకుంటారు?" అని ప్రతి ఒక్కరూ తమను తాము ప్రశ్నించుకోవాలని సూచించారు. ఒక వ్యక్తి తీసుకునే క్షణిక నిర్ణయం మొత్తం కుటుంబాన్ని జీవితాంతం విషాదంలోకి నెట్టవచ్చని హెచ్చరించారు.

**వ్యసనాలకు దూరంగా.. కుటుంబానికి దగ్గరగా**

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌తో పాటు మద్యం, డ్రగ్స్, గంజాయి తదితర వ్యసనాలకు దూరంగా ఉండాలని డీజీపీ పిలుపునిచ్చారు. "వ్యసనాలు వద్దు.. కుటుంబమే ముద్దు" అనే ఆలోచనతో ముందుకు సాగాలని సూచించారు.

**93 వేల మంది సిబ్బందికి ప్రత్యేక విజ్ఞప్తి**

తెలంగాణ పోలీసు శాఖలోని సుమారు 93 వేల మంది సిబ్బందికి డీజీపీ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఎలాంటి సమస్య ఎదురైనా ఆత్మహత్య ఆలోచనకు తావివ్వకుండా కుటుంబ సభ్యులు, సహచరులు, ఉన్నతాధికారులతో మాట్లాడాలని కోరారు. "ఆత్మహత్యలు వద్దు.. ధైర్యంగా జీవించాలి. సమస్యను చెప్పండి.. సహాయం కోరండి.. మీ కుటుంబం కోసం, మీ పిల్లల కోసం, మీ తల్లిదండ్రుల కోసం నిలబడండి" అని డీజీపీ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. ఒక ప్రాణాన్ని కాపాడటం అంటే ఒక కుటుంబాన్ని కాపాడటమేనని పేర్కొంటూ, ప్రతి పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా, ఆనందంగా, ధైర్యంగా జీవించాలన్నదే తన ఆకాంక్ష అని డీజీపీ స్పష్టం చేశారు.

## గణేష్ మండపాలకు ఆన్‌లైన్ అనుమతి తప్పనిసరి

- అనుమతి లేకుండా మండపాలు ఏర్పాటు చేస్తే చర్యలు
- ట్రాఫిక్, విద్యుత్, అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి



**గజ్వేల్ | సెప్టెంబర్ 10 | ఆశ్వి అప్డేట్స్:**

ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్న గణేష్ చతుర్థి ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తు ఆన్‌లైన్ అనుమతి పొందాలని గజ్వేల్ సీఐ రవికుమార్ సూచించారు. తెలంగాణ స్టేట్ పోలీస్ పోర్టల్ ద్వారా మండపాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిర్వాహకుల వివరాలు, ఇతర అవసరమైన సమాచారాన్ని ఆన్‌లైన్ దరఖాస్తులో నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పారు. సంబంధిత అధికారులు వివరాలను పరిశీలించిన అనంతరం క్యూఆర్ కోడ్/డిజిటల్ ఎన్ఓసీ ద్వారా అనుమతి జారీ చేస్తారని తెలిపారు.

**భద్రతా నిబంధనలు తప్పనిసరి**

మండపాల ఏర్పాటుతో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా నిర్వాహకులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఐ సూచించారు. విద్యుత్ భద్రతా ప్రమాణాలు, అగ్నిప్రమాదాల నివారణ చర్యలు తప్పనిసరిగా పాటించాలన్నారు. శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలను కూడా ఉత్సవ నిర్వాహకులు పాటించాలని స్పష్టం చేశారు.
అనుమతి లేని ప్రదేశాల్లో గణేష్ మండపాలను ఏర్పాటు చేయరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు**

గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, పరస్పర సహకారంతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ రవికుమార్ కోరారు. ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సేవల కోసం 100 లేదా 112 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.



## చాకలి ఐలమ్మ పోరాటాలు స్ఫూర్తిదాయకం

- హక్కుల కోసం ఆమె సాగించిన వీరోచిత పోరాటం తరతరాలకు ఆదర్శం
- వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన రజక సంఘం నాయకులు

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో | సెప్టెంబర్ 10 | ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, అమరవీరురాలు చాకలి ఐలమ్మ సాగించిన వీరోచిత పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని రజక సంఘం నాయకులు పేర్కొన్నారు. రేవల్లి మండల పరిధిలోని నాగపూర్ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రజక సంఘం అధ్యక్షుడు చిట్టిరాజుల మల్లేష్, కోశాధికారి గుడ్లనారి బొందయ్య, సలహాదారు బొడ్డిపల్లి నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ.. నాటి దొరలు, భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా తన హక్కుల సాధన కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం, పట్టుదల, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. మహిళా చైతన్యానికి, బహుజనుల హక్కుల పరిరక్షణకు ఐలమ్మ చేసిన కృషి మరువలేనిదన్నారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ప్రతి ఒక్కరూ ఆమె పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులర్పించారు.






## భూమి ఆరోగ్యమే రైతు భవిష్యత్‌కు బలం

మొదటిపేజీ తరువాయి

నూతన న్యూట్రియెంట్ ఉత్పత్తులను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఒకప్పుడు కరువు, ఆహార కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న భారత్ నేడు ప్రపంచానికి ఆహారం అందించే సామర్థ్యాన్ని సాధించిందన్నారు. వ్యవసాయ రంగంలో శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక పరిజ్ఞానం, రైతులకు అందిన ప్రభుత్వ సహకారం దేశాన్ని ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా నడిపించాయని పేర్కొన్నారు. ఎంఎస్ స్వామినాథన్ వంటి శాస్త్రవేత్తల కృషితో వచ్చిన హరిత విప్లవం దేశ వ్యవసాయ రంగానికి కొత్త దిశను చూపిందన్నారు. అదే విధంగా వైట్ రెవల్యూషన్ ద్వారా పాల ఉత్పత్తిలో, బ్లూ రెవల్యూషన్ ద్వారా మత్స్య రంగంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. అయితే భవిష్యత్ వ్యవసాయానికి కేవలం దిగుబడి పెంపు మాత్రమే కాకుండా.. భూమి ఆరోగ్యాన్ని కాపాడుతూ, రైతు పెట్టుబడి భారాన్ని తగ్గించే విధానాలు అవసరమని స్పష్టం చేశారు.

**ఎరువుల వినియోగంలో మార్పు రావాలి**

ప్రస్తుతం పంట సాగులో డీఏపీ, యూరియా వంటి రసాయన ఎరువుల వినియోగం అధికంగా ఉందని ఈటల రాజేందర్ అన్నారు. భూమికి వాస్తవంగా ఏ పోషకం ఎంత అవసరమో గుర్తించి, దానికి అనుగుణంగా ఎరువులను వినియోగించే శాస్త్రీయ విధానం రైతులకు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.నైట్రోజన్, పొటాష్, జింక్, సల్ఫర్ తదితర పోషకాలు పంట ఎదుగుదలకు కీలకమైనవని, వాటిని సమతుల్యంగా అందించడం ద్వారా భూమి ఉత్పాదకతను నిలబెట్టుకోవచ్చని పేర్కొన్నారు. అధిక మోతాదులో రసాయన ఎరువులు వేయడం కంటే.. అవసరమైన పోషకాలను సమర్థవంతంగా పంటకు అందించే సాంకేతికత అభివృద్ధి చేయడం ముఖ్యమన్నారు.

**తక్కువ పరిమాణంలో.. సమర్థవంతమైన పోషకాలు**

నైట్రోజన్‌తో పాటు సల్ఫర్‌ను సమర్థవంతంగా పంటకు అందించే సాంకేతికతపై సినర్జీ సంస్థ పరిశోధనలు చేసి నూతన ఉత్పత్తులను తీసుకురావడం అభినందనీయమని ఈటల రాజేందర్ అన్నారు.తక్కువ పరిమాణంలోనే అవసరమైన పోషకాలను పంటకు అందించే విధానాలు రైతుల ఎరువుల వినియోగాన్ని తగ్గించడంతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించేందుకు దోహదపడే అవకాశం ఉందన్నారు. అయితే ఇటువంటి సాంకేతికతలు రైతులకు అందుబాటులోకి రావాలంటే క్షేత్రస్థాయి పరిశోధనలు, ఫలితాల ఆధారంగా నిర్ధారణ, రైతులకు అవగాహన కల్పించడం కీలకమని పేర్కొన్నారు.

**సబ్సిడీ భారాన్ని తగ్గించే అవకాశం**

ఎరువులపై కేంద్ర ప్రభుత్వం భారీగా సబ్సిడీ అందిస్తోందని ఈటల రాజేందర్ తెలిపారు. ఎరువుల వినియోగాన్ని శాస్త్రీయంగా తగ్గించగలిగే సాంకేతికతలు విజయవంతమైతే భవిష్యత్‌లో ప్రభుత్వంపై ఎరువుల సబ్సిడీ భారం తగ్గే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. అయితే రైతుకు ఎరువుల లభ్యత తగ్గించడం లక్ష్యం కాకూడదని.. అవసరమైన పోషకాలను సరైన మోతాదులో, సరైన సమయంలో, సరైన పద్ధతిలో అందించడమే లక్ష్యం కావాలని ఆయన సూచించారు.




**భూసారం కాపాడితేనే వ్యవసాయం నిలబడుతుంది**

వ్యవసాయంలో భూమి ఆరోగ్యం గురించి ప్రత్యేకంగా ఆలోచించాల్సిన సమయం వచ్చిందని ఈటల రాజేందర్ అన్నారు. ఒకే రకమైన రసాయన ఎరువులను అధికంగా వినియోగించడం వల్ల నేలలో పోషకాల సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందని, అందువల్ల భూసార పరీక్షలు, శాస్త్రీయ ఎరువుల వినియోగం, సేంద్రియ పదార్థాల పెంపు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రైతు చేతిలో అధిక దిగుబడి మాత్రమే కాదు.. ఆరోగ్యకరమైన భూమి కూడా ఉండాలి. భూమిని రక్షిస్తూ ఉత్పాదకత పెంచే సాంకేతికతే భవిష్యత్ వ్యవసాయానికి దిశానిర్దేశం చేయాలని పేర్కొన్నారు.

**పర్యావరణహిత పరిశోధనలకు ప్రోత్సాహం**


సినర్జీ సంస్థ పర్యావరణహిత ఉత్పత్తులతో ముందుకు రావడం స్వాగతించదగ్గ పరిణామమని ఈటల రాజేందర్ అన్నారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, రైతు ఉత్పాదకత పెంచడం, భూమి ఆరోగ్యాన్ని కాపాడటం, పర్యావరణంపై ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడం వంటి అంశాలపై సంస్థ మరింత పరిశోధనలు చేయాలని ఆకాంక్షించారు. రైతు సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని వ్యవసాయ రంగంలో మరిన్ని పరిశోధనలు జరగాలని, ప్రయోగశాలలో అభివృద్ధి చేసే సాంకేతికత క్షేత్రస్థాయిలో రైతుకు ఉపయోగపడేలా మారాలని సూచించారు. సినర్జీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కర్, వెంకట్‌రెడ్డి, చంద్రారెడ్డి, టీవీ రావు తదితరులు వ్యవసాయ రంగంలో మరింత పరిశోధనలు చేపట్టి రైతాంగానికి ఉపయోగపడే నూతన ఉత్పత్తులను అందించాలని ఈటల రాజేందర్ ఆకాంక్షించారు.

**రైతు భూమి బాగుంటే.. దేశ వ్యవసాయం బాగుంటుంది**

దేశానికి ఆహార భద్రత కల్పించడంలో రైతు పాత్ర అత్యంత కీలకమని, రైతు భవిష్యత్ భూమి ఆరోగ్యంతోనే ముడిపడి ఉందని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. దిగుబడితో పాటు భూసారం.. లాభంతో పాటు పర్యావరణ పరిరక్షణ.. సాంకేతికతతో పాటు రైతు ప్రయోజనం అనే సమతుల్యతతో వ్యవసాయ రంగం ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఈ ఫుడ్స్ గుండె జబ్బులను తగ్గిస్తాయి

ప్రస్తుతం గుండె జబ్బులు రొటిన్ సమస్యలుగా మారాయి. వయసుతో సంబంధం లేకుండా అందరూ గుండె జబ్బు బారిన పడుతున్నారు. గుండె జబ్బులు, శ్వాస సంబధిత ఇబ్బందులు పడుతున్నారు. లైఫ్ స్టైల్, జీవన శైలి ఈ సమస్యలకు కారణం అని వైద్య నిపులు సూచిస్తున్నారు. ఆహారపు అలవాట్లలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దీన్ని ఖచ్చితంగా నియంత్రించవచ్చు. అకస్మాత్తుగా రక్తపోటును పెంచే అటువంటి ఆహారాన్ని తీసుకోకుండా జాగ్రత్త వహించాలి. అధిక బిపి విషయంలో తక్షణ ఉపశమనం కలిగించే ఆహారాలను ఎల్లప్పుడూ తినాలి. అటువంటి ఆహారాలు తీసుకోవడం వల్ల రక్తపోటును నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆ ఆహారాలు ఏంటో కొన్ని విషయాలు తెలుసుకుందాం.





**మధుమేహాన్ని అదుపు చేసే ఆహారాలు:**

ఆహారంలో పాలకూర, పాలకూర వంటి ఆకుపచ్చ కూరగాయల్లో కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని తింటే రక్తపోటును నియంత్రించవచ్చు.

అరటిపండులో ఉంటే పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. అధిక బిపి సమస్య నుంచి దూరంగా ఉండటానికి రోజుకు ఒక అరటిపండు తినవచ్చు. దాని నుంచి కొన్ని రుచికరమైన వంటకాలు చేసి కూడా తినవచ్చు.
బీట్‌రూట్‌లో నైట్రిక్ ఆక్సైడ్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్త నాళాలు తెరవడానికి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. రక్తపోటు అదుపులో ఉండాలంటే ఆహారంలో బీట్‌రూట్ చేర్చువాలని నిపుణులు చెబుతున్నారు.
వెల్లుల్లి యాంటీ బయోటిక్, యాంటీ ఫంగస్, నైట్రిక్ ఆక్సైడ్‌ను పెంచుతుంది. ఇది కండరాలను సడలించి రక్తనాళాలను విస్తరిస్తుంది. రక్తప్రసరణ మెరుగ్గా ఉండడం వల్ల బీపీ అదుపులో ఉంటుంది. పచ్చి వెల్లుల్లి రెబ్బలు తిన్నా.. వివిధ రకాల వంటలలో వేసుకుని తిన్న మంచి ఫలితం ఉంటుంది.

# వర్షా కాలంలో ఏ ఫుడ్ తినొద్దు.. ఏది తినాలి?

వర్షా కాలం వచ్చిందంటే చాలు అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ఈ సీజన్లో వచ్చే జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్, డెంగీ, గొంతు నొప్పి లాంటి సమస్యలు అధికంగా ఉంటాయి. అయితే ఆయుర్వేద నిప్పులు మాత్రం వీటిని తరిమికొట్టే ఉపాయాలు చెబుతున్నారు. వాటిల్లో ఒకటి బెల్లం, నల్లమిరియాలు. ఈ సీజన్లో వచ్చే వ్యాధులకు చెక్ పెట్టాలంటే దీనిని తినాలని చెబుతున్నారు. బెల్లం. మిరియాలతో ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో.. కొన్ని విషయాలు ఈ ఆర్టికల్లో తెలుసుకుందాం . దగ్గు, గొంతు నొప్పి, కీళ్ళ నొప్పులు, జీర్ణక్రియ, డిప్రెషన్ వంటి సమస్యలకు మంచి ఔషధం. పీరియడ్స్ నొప్పి తగ్గేందుకు, ఆకలి పెంచడానికి, తలనొప్పి, బరువు తగ్గడానికి మిరియాలను మిక్సీలో పట్టి పొడి చేసుకోవాలి. తర్వాత బెల్లం తురుమును కూడా పొడి చేసుకోవాలి. రోజు పరిగడుపున ఈ రెండు కలిపి ఒక టీ స్పూను తీసుకుంటే.. గొంతు నొప్పి, జలుబు, దగ్గు లాంటివి తగ్గిపోతాయి. పిల్లలకు పాలలో కలిపి ఇచ్చిన ఉపశమనం లభిస్తుంది. అయితే ఇలా నేరుగా తీసుకోలేని వాళ్ళు మిరియాలు పొడి, బెల్లం కలిపి ఆ నీటిని తాగిన జలుబు, దగ్గు నుంచి ఉపశమనం కలుగుతుంది. అంతేకాకుండా.. ఒత్తిడి నుంచి కూడా ఉపశమనం కలుగుతుంది. మహిళలకు పీరియడ్స్ సమస్యలు ఉంటే దీనిని తీసుకోవడం వల్ల ఉపశమనం కలుగుతున్నది. ఆకలి కాదని చాలామంది చెబుతూ ఉంటారు. అలాంటి వాళ్ళు మిరియాలు, బెల్లం తింటే ఆకలి పెరుగుతుంది. కొందరికి డిప్రెషన్ కారణంగా తలనొప్పి కూడా పెరుగుతుంది. అలాంటివారు ఉదయం, సాయంత్రం మిరియాల పొడి, బెల్లం కలిపి తింటే తలనొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు. ఈ మధ్యకాలంలో చాలామంది అధిక బరువు పెరిగి చెడు కొలెస్ట్రాల్‌తో ఇబ్బంది పడుతున్నారు,







# అంజీర్ ఆకులతో ఎన్ని లాభాలో?

ఆయుర్వేదం ప్రకారం.. ఆకులు, చెట్ల వేళ్లల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. మనం ఆరోగ్యంగా ఉండాలంటే ఆకులు, చెట్ల వేళ్లతో చేసే కషాయాలు, మెడిసిన్ తీసుకోమంటారు. అయితే అంజీర్ పండ్లు ఖరీదైన డ్రై ఫ్రూట్స్ అని మనందరికి తెలుసు. కానీ మార్కెట్‌లో అంతకంటే ఎక్కువగా అంజీర్ ఆకులకు డిమాండ్ ఉందట. వీటి ధర రూ. 2 నుంచి 3 వేల వరకు ఉంటుంది. అంజీర్ ఆకుల్లో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. అంజీర్ పండ్ల కంటే ఆకులను ఎక్కువగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదట. ఈ ఆకులు జీర్ణశక్తిని బలోపేతం చేయడంతోపాటు గుండె జబ్బులు, మధుమేహాన్ని అరికడుతుంది. అంజీర్ ఆకులు తీసుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఈ ఆర్టికల్‌లో కొన్ని విషయాలు తెలుసుకుందాం.

**అంజీర్ ఆకుల వల్ల ప్రయోజనాలు:**



అంజీర్ ఆకుల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఈ ఆకులు తీసుకుంటే కడుపులోని మలినాలు తొలగిస్తుంది. దీనివల్ల కడుపు సమస్యలు, మలబద్ధకం తగ్గిస్తుంది. అంజీర్ ఆకులు ప్రీబయోటిక్‌గా పనిచేస్తాయి. కడుపులో అనేక రకాల సమస్యలను తగ్గించే మంచి బ్యాక్టీరియాను ఉత్పత్తి చేస్తుంది. అంజీర్ ఆకులకు రక్తపోటును తగ్గించే శక్తి అధికంగా ఉంది. ఈ ఆకులు అధిక రక్తపోటును, చెడు కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది. అంజీర్ ఆకులకు రక్తంలో చక్కెర, మధుమేహాన్ని నియంత్రించే సామర్థ్యం ఉంది. ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో అంజీర్ ఆకులను నమిలి తింటే రక్తంలో చక్కెర శాతాన్ని బాగా తగ్గుతుంది.



**ఎప్పుడు తినాలి?**

అంజీర్ ఆకులను ఉదయాన్నే తినాలి. అల్పాహారం తీసుకునే ముందు కొన్ని ఆకులను నమలడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయి. దీన్ని ఉడికించి, టీ లాగా తయారు చేయవచ్చు. దీనికోసం నీటిని మరిగించి అందులో అంజీర్ ఆకులను వేసి టీ తయారు చేసి తాగాలి. పాశ్చాత్య దేశాల్లో అంజీర్ ఆకుల టీ చాలా ఫేమస్.



## కొత్త అధ్యాయాన్ని స్వాగతించేందుకు సిద్ధంగా ఉన్నా

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ఇటీవల 'మా ఇంటి బంగారం' మూవీతో బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ప్రస్తుతం ఆమె గర్భవతిగా ఉండటంతో కొద్దికాలం పాటు సినిమాలకు దూరంగా ఉంటూ పూర్తిగా విశ్రాంతి తీసుకుంటున్నారు. అయినప్పటికీ సోషల్ మీడియాలో నిత్యం ఫుల్ యాక్టివ్‌గా ఉంటున్న ఆమె, తన బేబీ బంప్ ఫొటోలతో పాటు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో టచ్‌లోనే ఉంటున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా, ఈ టాలెంటెడ్ బ్యూటీ ప్రముఖ జాతీయ మీడియా సంస్థ అయిన 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' మ్యాగజైన్ కవర్ పేజీపై చోటు దక్కించుకుని హాట్ టాపిక్‌గా నిలిచారు. ఈ సందర్భంగా.. తన వ్యక్తిగత జీవితంలో రాబోతున్న సరికొత్త మార్పులు, మాతృత్వపు అద్భుతమైన అనుభూతుల గురించి ఆమె మనసు విప్పి మాట్లాడారు. తన జీవితం పూర్తిగా మారిపోవడానికి, సరికొత్త బాధ్యతలను స్వీకరించడానికి తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని సమంత స్పష్టం చేశారు. తన రాబోయే బేబీ బంగారం కోసం ఎంతో ఆత్రుతగా, ఆనందంగా ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్న ఆమె, జీవితంలో మొదలుకాబోతున్న ఈ కొత్త అధ్యాయాన్ని ఎంతో సానుకూలంగా స్వాగతించేందుకు సిద్ధంగా ఉన్నాననే భావాన్ని అందరితో పంచుకున్నారు.



## స్క్రిప్ట్ సిద్ధం.. చిత్రీకరణ అప్పుడే!

'పెద్ది' సినిమాతో విజయాన్ని అందుకున్నారు కథానాయకుడు రామ్‌చరణ్. ఇప్పుడాయన తన 17వ చిత్రాన్ని దర్శకుడు సుకుమార్‌తో కలిసి పట్టాలెక్కించే ప్రయత్నాల్లో ఉన్నారు. 'రంగస్థలం' విజయం తర్వాత వీళ్లిద్దరి కలయిక నుంచి రానున్న రెండో సినిమా ఇది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయని సమాచారం. డిసెంబరు నుంచి షూటింగ్ మొదలయ్యే అవకాశమున్నట్లు తెలిసింది. ఈలోగా నటీనటులు, సాంకేతిక నిపుణుల్ని ఖరారు చేయనున్నారు. ఇక మరోవైపు ఈ సినిమా కోసం చరణ్ నాజూకైన కొత్త లుక్‌లో కనిపించనున్నారని.. దీనికోసం ఆయన బరువు తగ్గే ప్రయత్నాల్లో ఉన్నారని తెలుస్తోంది. మరి ఈసారి చెర్రీ కోసం సుకుమార్ ఎలాంటి శక్తిమంతమైన కథని.. వైవిధ్యభరితమైన పాత్రని సిద్ధం చేశారో తెలియాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడక తప్పదు.



## తేదీ దగ్గర పడుతోంది!

'సమయం గడిచిపోతోంది.. తేదీ దగ్గర పడుతోంది' అంటూ ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌లో రాబోయే కొత్త సిరీస్ విడుదల తేదీని ప్రకటించింది. బాలీవుడ్ నటి పరిణీతి చోప్రా ప్రధాన పాత్రలో తెరకెక్కిన సిరీస్ 'షాక్: ట్రస్ట్ నో వన్'. రెన్సిల్ డి సిల్వా దర్శకత్వం వహించారు. సప్న మల్హోత్రా, సిద్ధార్థ్ పి.మల్హోత్రా సంయుక్తంగా నిర్మించారు. ఈ సిరీస్ ఈ నెల 24 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానుంది. ఈ మేరకు సిరీస్ బృందం ఇన్‌స్టాలో ఓ పోస్టర్‌ని పంచుకుంది. జెన్నిఫర్ వింగెట్, అనూప్ సోనీ, సుమిత్ వ్యాస్ తదితరులు ఇందులో కీలకపాత్రలు పోషించారు. రెండేళ్ల కిందట వచ్చిన 'అమిర్‌సింగ్ చమ్కీలా' చిత్రం తర్వాత పరిణీతి.. ఇప్పుడీ మిస్టరీ థ్రిల్లర్‌తో ఓటీటీ ప్రేక్షకుల్ని పలకరించబోతుంది. కనిపించకుండా పోయిన బిడ్డ ఆచూకి కోసం తొమ్మిదేళ్లుగా ఆశ వదులుకోకుండా ఒక తల్లి చేసే భావోద్వేగ ప్రయాణం చుట్టూ తిరిగే కథ ఇదని సిరీస్ వర్గాలు తెలిపాయి.



## రెండేళ్ల గ్యాప్ తర్వాత బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చిన నివేదా..



ాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ ్యూటీ నివేదా థామస్ సెకండ్ ఇన్నిం ిస్‌లో విభిన్నమైన కథలతో అలరిస్తోం ి. 2024లో వచ్చిన '35 చిన్న కథ ాదు' చిత్రంతో అద్భుతమైన నటనతో ిమర్శకుల ప్రశంసలతో పాటు పలు ివార్డులు అందుకుంది. ఆ తర్వాత ాస్త బొద్దుగా మారడంతో సినిమాల ు కొంతకాలం బ్రేక్ ఇచ్చింది. దీంతో ివేదా ఇండస్ట్రీకి పూర్తిగా దూరం కాబో ుందంటూ ప్రచారం జరిగింది. కానీ ఆ వార్తలకు చెక్ పెడుతూ రెండేళ్ల గ్యాప్ ర్వాత ఓ సరికొత్త ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. తాజాగా, ఈ మూవీ అధికారిక ప్రకటన ిడుదల చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. నివేదా ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ఈ లేటెస్ట్ చిత్రానికి 'శ్రీమతి' అనే టైటిల్‌ను ారారు చేశారు. మూవీ ప్రకటనతో పాటు నివేదా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా మేకర్స్ విడుదల చేశారు.
ందులో నివేదా నడుముపై చేయి వేసుకుని కిచెన్ వాతావరణంలో నిల్చుని కనిపించింది. ఆమె పక్కన గరిటె, కాఫీ కప్, ెనకాల గ్యాస్ స్టవ్, వంట పాత్రలు దర్శనమిచ్చాయి. 'ప్రతి ఇంటి హృదయం నుంచీ ఒక కథ ఉద్భవిస్తుంది.. అది మనందరికీ ెలిసిన, మనం ప్రేమించే.. మనం జీవించే కథ' అని మేకర్స్ జత చేసిన క్యాప్షన్ నెటిజన్లను బాగా ఆకట్టుకుంటోంది. కిచెన్ ేపథ్యంలో వస్తున్న ఈ కథ ప్రతి ఇంట్లోని గృహిణుల జీవితాన్ని ఆవిష్కరించబోతోందని సమాచారం. ఒక సగటు ఇల్లాలు నుభవించే భావోద్వేగాలను ఇందులో ఎంతో సహజంగా చూపించబోతున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఈ చిత్రాన్ని 'ప్రైమ్ షో ంటర్‌టైన్‌మెంట్స్' బ్యానర్‌పై నిరంజన్ రెడ్డ, చైతన్య రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'సతీ లీలావతి' చిత్రంతో మంచి పేరు ెచ్చుకున్న దర్శకుడు విశ్వక్ ఖండేరావు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

## ఆ ట్రోల్స్‌కు భయపడి.. అవకాశాలు కూడా వదులుకున్నా

దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వచ్చిన 'కింగ్ ఆఫ్ కోథా' (King Of Kotha) పరాజయం తన కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపిందని ప్రముఖ నటి ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయం సాధించకపోవడం, తన నటనపై వచ్చిన విమర్శలు, ట్రోల్స్ ప్రభావం కెరీర్‌పై పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆ సినిమా పరాజయం తర్వాత ఎదురైన అనుభవాలను పంచుకున్నారు.

"2023లో భారీ అంచనాల మధ్య 'కింగ్ ఆఫ్ కోథా' విడుదలైంది. కానీ ఆ తర్వాత మలయాళ చిత్రపరిశ్రమ నాకు అవకాశాలు ఇవ్వడానికి భయపడినట్లు అనిపించింది. కేవలం నన్ను మాత్రమే కాదు, దుల్కర్‌తో సహా చిత్ర బృందాన్ని కూడా నెటిజన్లు తీవ్రంగా ట్రోల్ చేశారు. నా (Aishwarya Lakshmi) నటన, డైలాగ్ డెలివరీపై ఎన్నో విమర్శలు వచ్చాయి. కొన్నిసార్లు వారు అన్నది నిజమేనేమో అని నాకూ అనిపించేది. నేను అందులో దుల్కర్‌ను 'రాజువెట్టా' అని పిలిచాను. దానిని కూడా చాలా మంది ఎగతాళి చేశారు. 'హలోమమ్మీ' సినిమా షూటింగ్ సమయంలో ఒక అసిస్టెంట్ డైరెక్టర్ నన్ను పిలిచి మరీ వెక్కిరించారు. ఆ సమయంలో చాలా బాధపడ్డాను. ఆ తర్వాత దుల్కర్‌తో (Dulquer Salmaan) కలిసి ఓ వాణిజ్య ప్రకటనలో నటించే అవకాశం వచ్చింది. కానీ, ట్రోలింగ్ దెబ్బకు భయపడి వదులుకున్నాను. 'నేను నటిస్తే దారుణంగా విమర్శలు వస్తాయి. అది మీకే సమస్య కావచ్చు' అని చెప్పి ఆ ప్రాజెక్ట్‌ను తిరస్కరించా. ఆ సినిమా ట్రోల్స్ నన్ను అంతగా ప్రభావితం చేశాయి" అని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. అభిలాష్ జోషి దర్శకత్వంలో రూ. 50 కోట్లతో తెరకెక్కిన 'కింగ్ ఆఫ్ కోథా' చిత్రం థియేటర్లలో ఆశించిన స్థాయిలో అలరించలేక పోయింది. ఈ ప్రభావం తన మానసిక ధైర్యాన్ని దెబ్బతీసిందని ఐశ్వర్య లక్ష్మి పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె సాయి దుర్గా తేజ్‌కు జోడీగా 'సంబరాల ఏటి గట్టు' సినిమాలో నటిస్తున్నారు.



## 'మంజనత్తి'లో భాగమైనందుకు ఎంతో గౌరవంగా భావిస్తున్నాను



తెలుగు, తమిళ, కన్నడ మలయాళ ఇలా అన్ని భాషల్లోనూ వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతోంది యంగ్ బ్యూటీ కాయదు లోహర్. 'ఇమ్మోర్టల్', 'ఐయామ్ గేమ్' చిత్రాల తర్వాత ఈ భామ మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను తన ఖాతాలో వేసుకుంది. టాలెంటెడ్ డైరెక్టర్ మారి సెల్వరాజ్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న 'మంజనత్తి' మూవీలో ఆమె కీలక పాత్రకు ఎంపికైంది. ఈ చిత్రంలో ప్రియాంక మోహన్, పూర్ణిమ రవి, కదిర్ కూడా కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ కూడా లాంఛనంగా ప్రారంభమైంది. తాజాగా, కాయదు ఈ సినిమా గురించి ఓ షాకింగ్ పోస్ట్ పెట్టింది. "మనుషులను ఎప్పుడూ ఎవరో ఒకరు గమనిస్తూ ఉండటంలోనే ఒక రకమైన హింస దాగుంటుంది. అది ఎవరి మీదైనా కోపంతో చేసేది కాకపోవచ్చు, కనీసం మాట్లాడకుండా కేవలం నిరంతరం కనిపెట్టుకుని చూడటమే ఆ హింస. మనం ఎలా బతకాలో సమాజమే కొన్ని అదృశ్యమైన రూల్స్ పెట్టి వాటితో మనల్ని కొలుస్తూ ఉంటుంది. అణచివేత ఎప్పుడూ అలాగే బతుకుతుంది. ఎవరినీ బలవంతంగా లొంగదీయాల్సిన పనిలేదు. అలా లొంగి ఉంటేనే మీకు భద్రత దొరుకుతుందని నమ్మిస్తే చాలు, అదే అణచివేతను ముందుకు నడిపిస్తుంది.

## దీపావళికి మహాశక్తి?

'టాక్సిక్', 'హాయ్' చిత్రాలతో ఇటీవల థియేటర్లలో ప్రేక్షకుల్ని అలరించారు అగ్ర కథానాయిక నయనతార. ఇప్పుడామె మరో చిత్రంతో సినీ ప్రియుల్ని పలకరించేందుకు సన్నద్ధమవుతున్నారని సమాచారం. నయనతార ప్రధాన పాత్రలో 'మూకుతి అమ్మన్ 2' చిత్రం పట్టాలెక్కుతోన్న సంగతి తెలిసిందే. తెలుగులో మహాశక్తి అనే పేరుతో రానుందీ చిత్రం. సుందర్.సి దర్శకత్వంలో రూపొందుతుంది. డా.ఇషారి కె.గణేశ్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాని దీపావళి పండగ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోందని తమిళ చిత్రవర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రీ ప్రొడక్షన్ పనులు చేసుకుంటున్న ఈ చిత్రంలో రెజీనా, యోగిబాబు కీలకపాత్రలు పోషిస్తున్నారు.



PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S